
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు



నేటి నుంచి మధ్యాహ్న భోజనం

ఏలూరు అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు శనివారం నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించనున్నారు. జిల్లాలో మొత్తం 19 జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న 3,248 మంది విద్యార్థుల్లో భోజన పథకాన్ని వినియోగించుకునేందుకు 2,640 మంది నుంచి అంగీకారాన్ని ఇప్పటికే తీసుకున్నారు. ఏలూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భోజన పథకాన్ని స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటి శనివారం మధ్యాహ్నం ప్రారంభించనున్నారు. భోజనం ప్లేట్లు, గ్లాసులను కొందరు దాతలు సమకూర్చారని ప్రిన్సిపాల్ రాజాకృష్ణ తెలిపారు.

నిర్వాసితుల 'కల' పండింది

- పన్నెండేళ్ల సుదీర్ఘ కల సాకారమైంది.. వ్యక్తిగత పరిహారం డిమాండ్ నెరవేరింది
- తాజాగా వ్యక్తిగత ఖాతాల్లో నేరుగా జమ.. 41.15 కాంటూరు పరిధిలోనే ఈ చెల్లింపులన్నీ..
- కూటమి ప్రభుత్వ చొరవ పట్ల హర్షామోదాలు.. గతంలో నాటకాలాడిన జగన్ ప్రభుత్వం



ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

పోలవరం కోసం సర్వం త్యాగం చేసిన కుటుంబాలకు. దశాబ్దం పైగా పరిహారం కోసం చూస్తున్న ఎదురుచూపులు ఫలించాయి. ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న ఊరు, సొంత గడ్డను వదిలేసి సర్వం ధారపోసిన ఈ కుటుంబాలకు కూటమి ప్రభుత్వంలో తొలిసారి ఊరట దక్కింది. నిరాశ్రయ కుటుంబాల్లో వ్యక్తిగత పరిహారం చెల్లింపు శుక్రవారమే ఆరంభమైంది. సీఎం చంద్రబాబు తాము చేసిన త్యాగాలను గుర్తు పెట్టుకుని ఆదుకున్నారంటూ హర్షామోదాలు వ్యక్తం చేస్తున్నారు.

7

తెలుగింట సంబరం



ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు
నేడు : భీమవరం, జంగారెడ్డిగూడెం
రేపు : ఏలూరు

సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నారీమణుల కోసం ఎప్పటిలాగే రెండు రోజులపాటు జరిగే ముత్యాల ముగ్గుల పోటీలకు వేదికలు సిద్ధమయ్యాయి. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సారథ్యంలో భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం తొమ్మిది గంటలకు నుంచి భీమవరం డీఎన్ఆర్ కళాశాల ప్రాంగణంలోను, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఆ స్కూల్ ఆవరణలోను పోటీలు ప్రారంభం కానున్నాయి. మగువ ట్రెండింగ్ డిజైన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఏలూరు అశోక్‌నగర్‌లోని కేపీడీటీ హైస్కూల్ గ్రౌండ్‌లో పోటీలు జరుగుతాయి. ఒక్కో కేంద్రంలో న్యాయ నిర్ణేతలు విజేతలను ఎంపిక చేసి మొదటి బహుమతి రూ.6 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు చొప్పున నగదుతోపాటు కన్సొలేషన్ బహుమతులు అందజేస్తారు.

విద్యార్థులకు బూట్ల కొలతల సేకరణ ప్రారంభం

ఏలూరు అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పేరిట వచ్చే విద్యా సంవత్సరానికి పంపిణీ చేయనున్న కిట్‌లలో భాగంగా విద్యార్థుల బూట్ల కొలతలను ఈ నెల 6వ తేదీలోగా సేకరించే ప్రక్రియ ప్రారంభమైంది. పాఠశాలల వారీగా విద్యార్థులకు పాదరక్షల కొలతలను సెంటీమీటర్లతో సహా ఖచ్చితంగా తీసుకుని నిర్ణీత ఫారంలలో నమోదుచేసి పంపాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలు మొత్తం 1,15,998 మంది ఉన్నారు. వీరందరి పాదకొలతలను స్కేళ్ల ద్వారా నిర్ధారించి పంపించాల్సిన బాధ్యతలను సంబంధిత పాఠశాలల హెచ్ఎంలు, వ్యాయామోపాధ్యాయులకు అప్పగించారు.

రోగ నిర్ధారణలో ఎల్టీలదే కీలకపాత్ర : డీఎంహెచ్‌వో

ఏలూరు అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : రోగ నిర్ధారణ పరీక్షల్లో కీలకమైన ల్యాబ్ టెక్నీషియన్లు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మంచిపేరు తీసుకురావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని సూచించారు. ఏలూరులో శుక్రవారం ల్యాబ్ టెక్నీషియన్లతో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీల వారీగా జరుగుతున్న రోగనిర్ధారణ పరీక్షలపై సమీక్షించారు. రోగుల పట్ల అశ్రద్ధ చూపించకుండా ఖచ్చితమైన పరీక్షలు, ల్యాబ్ ఫలితాలను ఇచ్చినపుడే వారికి ధైర్యం ఏర్పడుతుందన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ నిర్మూలనలో ల్యాబ్ టెక్నీషియన్లదే కీలకపాత్ర అని పేర్కొన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, సిబ్బంది నాగమల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



నగర పాలక సంస్థ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

హామీలు నెరవేర్చాలంటూ మునిసిపల్ కార్మికుల ధర్నా

ఏలూరు టూటౌన్, జనవరి3 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరిస్తామని వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని గతేడాది 16 రోజులు సమ్మె నిర్వహించగాఅప్పటి వైసీపీ ప్రభుత్వం సమస్యలు నెరవేరుస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు సోమయ్య ఆధ్వర్యం లో కమిషనర్ భానుప్రతాప్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎల్.కృష్ణారావు, జాన్‌బాబు, భవాని, నాగమణి, గౌస్య, సోమేశ్వ రరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌ను పరిశీలించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి



ఏలూరు క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని వన్‌స్టాప్ సెంటర్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ శుక్రవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. బాధితులకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాధితులకు అవసరమైన పక్షంలో బాధితులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయసహాయాన్ని అందిస్తామన్నారు. వన్‌స్టాప్ సెంటర్ పరిపాలనాధికారిణి చుక్కా నిర్మల, ప్యానల్ లాయర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం మురిసేలా!

నేడు కొవ్వలి జడ్పీ హైస్కూల్‌లో జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

- హాజరు కానున్న మంత్రులు నాదెండ్ల , కొలుసు.. ఎంపీలు పుట్టా, పురందేశ్వరి
- మూడు కేటగిరీల్లో పోటీలు.. 91 ప్రాజెక్టుల ప్రదర్శన

నిడమర్రు/దెందులూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు సృజనకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయి. విద్యార్థులలో సృజనాత్మకత, తార్కిక ఆలోచన పెంచడానికి విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తోంది. ఇప్పటికే డిసెంబరులో పాఠశాల, మండల స్థాయిల్లో సైన్స్ ఫెయిర్స్ నిర్వహించిన విద్యాశాఖాధికారులు శనివారం దెందులూరు మండలం కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ పౌరసంబంధాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొనున్నారు. గణితం, భౌతిక -రసాయన శాస్త్రం, భూమి, పర్యావరణం, అంతరిక్ష శాస్త్రం, ఇంజనీరింగ్, జీవ శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ మొత్తం ఎనిమిది అంశాలపై ప్రాజెక్టులు ప్రదర్శించనున్నారు.

మొత్తం 91 ప్రాజెక్టులు

జిల్లాలోని 27 మండలాల నుంచి మండలానికి మూడు చొప్పున మొత్తం 81 ప్రాజెక్టులు, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉన్న పాఠశాలల నుంచి 10 అంశాలు మొత్తం 91 ప్రాజెక్టులు ప్రదర్శించనున్నారు. ఈ పోటీల్లో ఒక్కో కేటగిరి నుంచి రెండు టీమ్‌లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. మొత్తం రాష్ట్ర స్థాయికి ఆరు టీమ్‌లు ఎంపిక అవుతాయి. ఈ ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబరిచిన వారికి సాయంత్రం బహుమతి ప్రదానం జరుగుతుందని డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ, కొవ్వలి హైస్కూల్ హెచ్ఎం శర్మ తెలిపారు.

తొలిసారిగా ఉపాధ్యాయులు..

జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ సైన్స్ ఫెయిర్‌లో జిల్లాలోని 27 మండలాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొనున్నారు. మూడు కేటగిరీల్లో పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థుల వ్యక్తిగత కృత్యాలు, గ్రూపు కృత్యాలు, ఉపాధ్యాయుల కేటగిరిల్లో పోటీలు జరుగుతాయి. తొలిసారి ఈ పోటీల్లో ఉపాధ్యాయులు పాల్గొనే అవకాశం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు. ఇప్పటికే మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు నేడు జరిగే జిల్లాస్థాయి పోటీల్లో తమ ప్రతిభ చూపేందుకు సన్నద్ధమయ్యారు.



జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ జరిగే కొవ్వలి జడ్పీ హైస్కూల్

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపు



విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, తార్కిక ఆలోచన, సృజనాత్మకతను పెంచడానికి సైన్స్ ఫెయిర్‌లు వేదికగా నిలుస్తాయి. సమాజ శ్రేయస్సు, భూమి, పర్యావరణ పరిరక్షణ, మానవాళికి ఉపయోగకరమైన ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వనున్నాం. థర్మకోల్ ప్రాజెక్టులు అనుమతి లేదు.

- వెంకటలక్ష్మమ్మ, డీఈవో, ఏలూరు

ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోకి.. బయట ఆహారం నిషేధం

- ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్



నూజివీడు టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థులకు బయట నుంచి వస్తున్న ఆహార పదార్థాలను నెలపాటు నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నట్టు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్ర కుమార్ తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో కొద్దికాలంగా విద్యార్థులు బయట ఆహారం వల్ల అస్వస్థతకు గురవుతున్నట్టు గమనించామన్నారు. ఈ నేపథ్యంలో నెలరోజుల పాటు క్యాంపస్ బయట నుంచి ఎటువంటి ఆహార పదార్థాలు తీసుకురాకూడదని, విద్యార్థులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తల్లిదండ్రులు క్యాంపస్‌కు వచ్చేటప్పుడు ఇంటివద్ద నుంచి ఆహార పదార్థాలు తీసుకురావచ్చని తెలిపారు. గతంలో ట్రిపుల్ ఐటీలోకి బయటనుంచి ఆహారపదార్థాలు తీసుకొచ్చే పరిస్థితి లేదని, అయితే గత ఆరునెలల క్రితం ట్రిపుల్ ఐటీలో ఆహార నాణ్యతపై ఆరోపణలు రావడంతో బయట నుంచి ఆహారం తీసుకొచ్చేందుకు అనుమతి ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం దీనిని నిషేధించినట్టు తెలిపారు.

చాట్రాయి తహసీల్దార్‌పై సీఎంకు ఫిర్యాదు



నూజివీడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి తహసీల్దార్ వ్యవహారశైలిపై సీఎం చంద్రబాబు నాయుడుకు చాట్రాయి మండల తెలుగు తమ్ముళ్లు ఫిర్యాదు చేశారు. అమరావతిలో సీఎంను కలిసిన మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోళ్ళపల్లి ప్రభాకర్ తహసీల్దార్ వ్యవహారశైలిపై ఫిర్యాదు చేశారు. ఆమె తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఫారెస్ట్ భూములను, రెవెన్యూ రికార్డుల్లో లేని భూములను రికార్డులు తారుమారు చేసి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటోందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. తహసీల్దార్‌పై ఆరు ఆరోపణలు చేస్తూ సీఎంకు ఫిర్యాదు చేశారు.














హైందవ శంఖారావానికి తరలిరావాలని ఏలూరు నగరంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు

రేపు హైందవ శంఖారావం



- భారీగా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లాలో విస్తృత ప్రచారం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కలిగించాలని, ఆలయాల నిర్వహణలో సంస్కరణలు కోరుతూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఈ నెల 5న గన్నవరం సమీపాన కేసరపల్లి హైందవ శంఖారావం నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి భారీగా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లో ప్రజలను చైతన్య పరిచేలా ప్రచారం నిర్వహించారు. దేవాలయాల్లో, దేవదాయ ధర్మదాయ శాఖలో అన్యమత ఉద్యోగులను తొలగించాలని, పూజ, ప్రసాద కైంకర్య సేవలన్నీ అత్యంత భక్తిశ్రద్ధలతో నాణ్యతతో నిర్వహించాలని, దీనిని ఉల్లంఘించే వారిని కఠినంగా శిక్షించాలని, మరో 8 డిమాండ్లతో శంఖారావానికి నాంది పలికారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న ఏకైక నినాదంతో ఇంతకు ముందే వివిధ రాష్ట్రాల గవర్నర్లకు మెమోరాండం సమర్పించారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జరుగుతున్న హైందవ శంఖారావానికి పెద్ద ఎత్తున ప్రచారం కల్పించారు. పార్టీలకు అతీతంగా ముఖ్యులను కలిసి శంఖారావానికి హాజరుకావాల్సిందిగా ఆహ్వాన పత్రికలను అందించారు. మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ప్రదర్శనలతో విస్తృత ప్రచారం చేపట్టారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో హిందువులు మాత్రమే ఉండాలని, దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లో రాజకీయ పార్టీలతో ప్రమేయంలేని హిందూ ధైవ భక్తులను మాత్రమే ఉండాలని, దేవాలయాల నిర్వహణపై ధర్మాచార్యుల నమూనా విధి విధానాలను అమలు చేయాలని, దేవాలయాల పరిసరాల్లో దుకాణాలన్నీ హిందువులకే కేటాయించాలని, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని, కబ్జాకు గురైన ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. హైందవ శంఖారావానికి తరలివెళ్ళేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. బీజేపీ శ్రేణులు, అనుబంధ సంఘాల వారు వీటిలో నిమగ్నమయ్యాయి. బీజేపీ నేత తపన చౌదరి తన వంతు బాధ్యతను నిర్వహిస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నారు. దేవాలయాల పరిరక్షణకు జాతీయ స్థాయి ఉద్యమంలో తాను భాగస్వామి అన్నట్టుగా తపన చౌదరి జిల్లాలో అన్ని సమావేశాలకు హాజరయ్యారు.

హైందవ శంఖారావానికి ఏలూరు జిల్లా నుంచి 500 బస్సులు, కార్లు, బైకలతో ప్రజలు తరలి వెళ్లనున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు. వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు హైందవ శంఖారావం బహిరంగ సభకు అధ్యక్షత వహించనున్నారు. జాతీయ రహదారి పొడవునా పెద్ద ఎత్తున వెలిసిన హైందవ శంఖారావం హోర్డింగ్‌లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

మావుళ్లమ్మ ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు


ఉత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే అంజిబాబు

అధికారులతో ఎమ్మెల్యే అంజిబాబు, డీఆర్వో సమీక్ష

భీమవరం టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ వార్షిక మహోత్సవాలు ఈ నెల 13 నుంచి ఫిబ్రవరి 14వ వరకు జరగనున్నాయి. ఉత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), డీఆర్వో మొగిలి వెంకటేశ్వరరావు శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ, దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో 61వ వార్షికోత్సవాలు జరుగుతున్నాయన్నారు. వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులందరికి మంచి దర్శనం కల్పించాలని, వీఐపీ దర్శనాల పేరిట భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేయాలని, విద్యుత్ ఇబ్బందులు లేకుండా విద్యుత్ శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. దేవాలయానికి వచ్చే రోడ్డులో మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. పొట్టి శ్రీరాములు విగ్రహం వెనుక ఖాళీ స్థలంలో మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, పారిశుధ్యం మెరుగుదలకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కమిషనర్ రామచంద్రారెడ్డికి సూచించారు. వచ్చే నెల 14న అన్నసమారాధన రోజున ఎక్కువ కౌంటర్లు ఏర్పాటుచేసి ప్రతి భక్తునికి అన్నప్రసాదం అందేలా సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు.

డీఆర్వో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సవాలు జరిగే రోజుల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. భక్తులకు అమ్మవారి లడ్డూ, పులిహోర ప్రసాదం లోటు లేకుండా అందేలా దేవస్థానం చర్యలు తీసుకోవాలన్నారు. క్యూ లైన్ల నిర్వహణకు పటిష్ట బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా జనరేటర్ ఏర్పాటు, షార్ట్ సర్క్యూట్ సమస్యలపై విద్యుత్ శాఖ అధికారులు తనిఖీ చేయాలన్నారు. ఏఎస్పీ భీమారావు మాట్లాడుతూ ఉత్సవ ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి ఇ.సుబ్బారావు, ఆలయ ఈవో బుద్దా మహాలక్ష్మి నగేష్, ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ, వన్‌టౌన్ సీఐ ఎస్.నాగరాజు, విద్యుత్ శాఖ ఎస్ఈ ఏ.రఘునాథబాబు, మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తహసీల్దార్ వి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.


పాలకొల్లులో కొడుకులు, కోడళ్లు, మనుమలు, కుటుంబసభ్యులతో పేకేటి పెద్దిరాజు

25 ఏళ్ల తరువాత ఆనందం..


మనుమలతో కలిసి తాతయ్య

- తండ్రి రాకతో కుమారుల సంతోషం
- పాలకొల్లులో మనుమల సందడి

యలమంచిలి / పాలకొల్లు టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన తండ్రి 25 ఏళ్ల తరువాత తిరిగివస్తే.. ఆ ఇంట పండుగే.. యలమంచిలి లంకకు చెందిన పేకేటి పెద్దిరాజు మతిస్థిమితం లేని పరిస్థితిలో ఎటో వెళ్లిపోయాడు. బంధువులు అతడి ఆచూకీ కోసం చేయని ప్రయత్నం లేదు. ఐదేళ్ల వయసు పిల్లలకు తండ్రి దూరమయ్యాడు. 25 ఏళ్ల తర్వాత ఆ తండ్రి పేకేటి పెద్దిరాజు ఆచూకీ తెలియడంతో కుమారుల ఆనందానికి హద్దే లేదు. తమిళనాడులోని తిరువెర్కాడులో అతడున్న ఉన్నట్లు స్వచ్ఛంద సంస్థ ద్వారా తెలుసుకుని అతని కుమారులు గంగాసురేష్, రమేష్‌బాబు తీసుకువచ్చారు. పాలకొల్లులో నివాసం ఉంటున్న గంగాసురేష్ ఇంటికి శుక్రవారం ఉదయం పెద్దిరాజును తీసుకువచ్చారు. 25ఏళ్లపాటూ దూరమైన బంధాలు, బంధుత్వాలు తిరిగి కలిశాయి. పెద్దిరాజు ఇంటికి చేరుకోవడంతో కొడుకులు, కోడళ్లు, మనుమలు, కుటుంబ సభ్యులు, బంధువుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వారు సంతోషంతో సంబరాలు చేసుకున్నారు. ఇంటిల్లిపాదీ సంతోషంతో గడిపారు. ఈ సందర్భంగా గంగాసురేష్, రమేష్‌బాబులు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో తండ్రి దొరకడం తమకు నిజమైన పండుగ అని పేర్కొన్నారు. మా తండ్రిని అక్కున చేర్చుకుని.. మాకుటుంబానికి చేరువచేసిన ఉడవుం కరంగల్ సామాజిక సేవా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్రాంతి స్పెషల్

పందెం కోడి సై




గాబుల్లో పందెం కోళ్లు

- పందెం పుంజుల పెంపకం
- రూ.20 వేల నుంచి రూ.2 లక్షల ధర
- కోళ్లకు ప్రత్యేక శిక్షణ.. ఆహారం
- మేతకు వేలాది రూపాయల ఖర్చు
- పెంపకందార్లకు ఉపాధి

రంగవల్లులు, గొబ్బెమ్మలు, హరిదాసులతో నెల రోజులు సందడే సందడి. పండుగ సమీపిస్తే కోడి పందేలతో ఫుల్ జోష్. ఇదీ సంక్రాంతి వస్తోందంటే గ్రామాల్లో కనిపించే హడావుడి. ఏడాది కాలంగా ఎదురుచూసే కోడి పందేల జాతర సమీపించడంతో పందెం పుంజులను సిద్ధం చేస్తున్నారు. పెంపకందారుల వద్ద ప్రత్యేక ఆహారం, శిక్షణతో బరిలోకి సిద్ధమైన పుంజులు వేలు, లక్షల ధర పలుకుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాలో పందెంకోళ్ల పెంపకం కుటీర పరిశ్రమ స్థాయిలో సాగుతోంది. పందేలకు ప్రత్యేకమైన కాకి, డేగ, తీతువ, కాకిడేగ, రసంగి, కోడి కాకి, కోడి పింగళ, నెమలి, నెమలి పింగళ, కోడి నెమలి, కాకి నెమలి, నెమలి డేగ, పూలా వంటి కోళ్ల రకాలు పోరుకు కాలు దువ్వుతున్నాయి.

- పెదవేగి/కైకలూరు, ఆంధ్రజ్యోతి


డేగ


నెమలి


పసర కాకి

సంక్రాంతి పందేలకు కోడిపుంజుల పెంపకం కేంద్రాలకు ఒక్కసారిగా డిమాండ్ వచ్చింది. ఉమ్మడి జిల్లాలో వందలాది మంది పందెం కోడిపుంజులు పెంచుతున్నారు. కైకలూరు నియోజకవర్గంలో సుమారు 30 నుంచి 40 మంది పందెం పుంజుల పెంపకాన్ని చేపట్టారు. పెదవేగి మండలంలో పలు గ్రామాల్లో కోడి పుంజుల పెంపకం చేపట్టారు. కొంతమంది పుంజులను విక్రయిస్తుండగా, మరికొందరు పందేలు వేయడానికి పుంజులను సిద్ధం చేస్తున్నారు. ఔత్సాహికులు అనుభవజ్ఞులను మధ్యవర్తులుగా పెట్టుకుని రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు వెచ్చించి కోళ్లను కొనుగోలు చేస్తున్నారు. రూ.లక్ష ధర పలికే పుంజులు ఎక్కువగా ఉంటాయి. పండగ రోజుల్లో రూ.3 లక్షల ధర కూడా పలుకుంది. మేలుజాతి పుంజు కనీస ధర రూ. 20 వేలు ఉంటుంది.

పందెం పుంజుల పెంపకం క్రమపద్ధతిలో ఉంటుంది. నిత్యం అనేక రకాల శిక్షణ ఇస్తారు. ఒక్కొక్క పుంజు పెంపకానికి సుమారు రూ.20 వేల నుంచి రూ.30వేలు వరకు ఖర్చు పెడుతుంటారు. వంద పుంజుల పెంపకం నలుగురు పర్యవేక్షిస్తుంటారు. హైదరాబాద్, వంటి ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన వారు పుంజుల కొనుగోలుకు ముందుకు వస్తారు. అనుభవజ్ఞుల సూచనతో పుంజులను బరిలో దింపుతారు.

వేలల్లో మేతకు ఖర్చు..

పందెం కోడిపుంజులకు పిల్ల దశ నుంచి కోడిగుడ్డు ప్రతీరోజూ ఆహారంగా ఇస్తారు. రాగులు, సజ్జలు, ధాన్యం వంటి వాటిని నీటిలో నానబెట్టి కొన్ని గంటల తరువాత ఆహారంగా అందిస్తారు. సంక్రాంతికి ఆరు నెలల ముందు నుండి బాదం, జీడిపప్పు, నల్ల ఖర్జూరం, అంజీరతో పాటు మటన్ కీమాను ఆహారంగా అందిస్తారు. ఈ ఆహారంతో కోడి బలంగా పెరగడమే గాక పందెంలో ఎక్కువసేపు పోరాడగల శక్తి కలిగి ఉంటుంది.

తిథుల ప్రకారం..!

భోగి, పండుగ, కనుమ రోజుల్లో ఉండే తిథులను బట్టి ఆయా సమయాల్లో ఏ రంగు కోళ్లు విజేతగా నిలుస్తాయో అంచనాలు వేస్తున్నారు. తిథుల ప్రకారం పుంజులను బరిలో దించేందుకు అనేకమంది మొగ్గు చూపుతారు. కోడిపుంజు రంగులకు ప్రాధాన్యం ఇస్తారు. కాకి, డేగ, తీతువ, కాకిడేగ, రసంగి, అబ్రాస్, రసంగి, కెక్కిరాయి, డేగ, కాకి, కాకిడేగ, కోడికాకి, కోడిపింగళ, నెమలి, నెమలిపింగళ, కోడినెమలి, కాకినెమలి, నెమలిడేగ, పూలా ఇలా రంగును బట్టి పందెం కోళ్ల పేర్లు చెబుతుంటారు.


తెలుపు అబ్రాస్


రసంగి


తీతువ


అబ్రాస్



కోడిపుంజులకు ప్రత్యేక శిక్షణ

ఈత.. నడక.. పరుగు..!

కోడి పుంజులు పెంపకంతో పాటు పందేలకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. పెంపకందారులు ఎక్కువ సమయం వాటిని కట్టివేయడం లేదా గంపల్లో ఉంచుతారు. ఎక్కువ దూరం నడిచే పరిస్థితులు ఉండకపోవడంతో ఒక పొడవాటి తాడు కట్టి దానిపై నడిపించడం, నిలబెట్టడం చేస్తారు. మరికొంతమంది రెండు బరకాల మధ్యలో పుంజును పరుగు పెట్టిస్తుంటారు. సంక్రాంతి పండుగకు నెల రోజులు ముందు నుంచి శిక్షణ ఇవ్వడంతో కోళ్ల కొవ్వు కరిగి గట్టిదనం పెరుగుతుంది. వీటితో పాటు వేడినీటితో స్నానం చేయించడం, పెనం పై వచ్చిన వేడిని ఆవిరి ద్వారా పట్టించడం చేస్తుంటారు. దీనితో కోడి గట్టిదనం సంతరించుకుని పందెంలో కత్తిదెబ్బ తగిలినా తట్టుకోగలుతుంది. తర్ఫీదు ఉన్న కోళ్లకు అధిక డిమాండ్. అనుగుణంగా ధర కూడా ఎక్కువ పలుకుతుంది. పందెం కోళ్లకు మేక మాంసం కైమా, బాదం పప్పు వంటి బలమైన ఆహారాన్ని కోడికి అందిస్తారు. దీంతోపాటు శాకాలు (కాపడం) పెట్టడం, ఈత కొట్టించడం (స్విమ్మింగ్), నడిపించడం (వాకింగ్) సాధారణం.

నడక.. ఆరోగ్యం

ఫిట్‌నెస్



యాంత్రిక జీవనంలో దాదాపు 80శాతం మంది నడకకు దూరమయ్యారు. గతంలో కార్మిక కర్షక వర్గాలు, సామాన్య పేద వర్గాలలో అధిక శాతం మంది దైనందిన చర్యలలో నిత్యం నడిచేవారు. ఇప్పుడు ఆయా వర్గాల వారు కూడా నడకను మరిచిపోయారు. ఒకవైపు పని ఒత్తిడి మరో వైపు సమయాభావంతో ప్రజలు నడవలేని పరిస్థితి ఏర్పడింది. మనిషికి నడకే ఆరోగ్యమని తగినతం సమయం నడిస్తే సమస్త అనారోగ్యాలను జయించవచ్చని వైద్యవర్గాలు చెబుతున్నాయి. నడక.. ఆరోగ్యంపై ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.

- పాలకొల్లు, ఆంధ్రజ్యోతి

- యాంత్రిక జీవనంలో కొరవడిన వ్యాయామం
- నడక మరిచిపోయిన పౌరులు
- తగ్గుతున్న శరీర పటుత్వం

ఒరేయ్ కన్నా వీధి చివర కిరాణా షాపులో పంచదార తీసుకురా అన్నది తల్లి.. అలాగే నమ్మా డాడీ బైక్ కీ ఇమ్మను అనే సమాధానం చెప్పే తనయుడు. ఇంటికి పది పర్లాంగుల దూరంలో పాల దుకాణంలో పాల ప్యాకెట్ తేవడానికి వాహనం. ఈ పరిస్థితుల్లో నడక సైక్లింగ్ సైతం మరచిపోయారు. దీంతో బాల్యం నుంచి వృద్ధాప్యం వరకూ పౌరులు అనారోగ్యం బారిన పడుతున్నారు.

ప్రాథమిక స్థాయి నుంచి ర్యాంకుల వేటలో విద్యాలయాలు సైతం పిల్లలు క్రీడా మైదా నాలకు వెళ్లకుండా ఎడాపెడా చదువుతో రుద్దేస్తున్నాయి. ఫలితంగా బాల్యంలోనే మధుమేహం, ఊబకాయం, ఇవి చాలవన్నట్టు చిన్నతనంలో గుండెపోటులకు గురవుతున్నారు. వీటన్నింటికీ ప్రధాన కారణం నడక, వ్యాయామం లోపించడమే. అందుకే వ్యాయామ నిపుణులు వీలైతే పరుగెత్తు లేదంటే కాస్తంత నడవమని చెబుతున్నారు.

ప్రతీ రోజూ కనిష్ఠంగా 30 నిమషాలు గరిష్ఠంగా 60 నిమషాలు నడవాలి. నడవడం వల్ల కండరాలు ఎక్కువ గ్లూకోజ్‌ను ఉపయోగిస్తాయి. అదనపు శరీర కొవ్వును తగ్గిస్తాయి. రోజూ అరగంట నడవడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. ఎముకలు బలోపేతం అవుతాయి. కండరాల శక్తి, ఓర్పు పెరుగుతుంది. ఆర్థరైటిస్ లక్షణాలు తగ్గుతాయి. మానసిక స్థితి మెరుగుపడుతుంది. ఒత్తిడి తగ్గుతుంది, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. నిత్యం నడిస్తే విటమిన్ డి పెరుగుతుంది.

జిల్లాలో సుమారు 75 వాకర్స్ క్లబ్‌లు ఉన్నాయి. విశాఖపట్టణం కేంద్రంగా హాల్వార్ దాస్ 1986లో వాకర్స్ క్లబ్‌ను స్థాపించారు. ఇప్పుడు వాకర్స్ క్లబ్‌లు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడి ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్‌గా పేరు తెచ్చుకుంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న వాకర్స్ క్లబ్బులలో సుమారు 5వేల మంది సభ్యులు ఉన్నారు. పౌరులు వాకింగ్ గ్రూప్‌లలో చేరడం వల్ల రోజూ నడవాలనే ఉత్సాహం వస్తుందని వాకర్స్ క్లబ్ నాయకులు చెబుతున్నారు.

పైసా ఖర్చు లేని నడకను ప్రతీ ఒక్కరూ అలవర్చుకొని క్రమం తప్పకుండా ఆచరిస్తే నాలుగింట మూడు వంతులు రోగాలు వాటంటవే తగ్గుతాయని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. నడవండి. నడిపించండి అనే సూక్తితో పౌరులందరూ నడక ప్రాధాన్యతను గుర్తించాల్సి ఉంది.


- వ్యాయామాలకు ఖరీదైన పరికరాలు అవసరం. నడకకు ఏవిధమైన పరికాలు అవసరం లేదు. మైదానప్రాంతాలు మట్టిరోడ్లపై నడక ఆరోగ్యాన్ని ఇస్తుంది. నిత్యం నడకతో ఆసుపత్రుల అవసరం తగ్గుతుంది.
- నడక వల్ల గుండె సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గుతుంది. రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. వేగంగా నడవడం వల్ల గుండెకు, శ్వాస వ్యవస్థకు ప్రయోజనం కలుగుతుంది. డిప్రెషన్‌తో బాదపడేవారికి నడక మేలు చేస్తుంది.
- నడవడం వల్ల శరీరంలో ఎముకలు పటిష్ఠంగా ఉంటాయి. ఎముకలు పెళుసుగా మారడాన్ని నడకతో నివారించవచ్చు
- నిత్యం నడిస్తే శరీరంలోని కండరాలు బలంగా మారతాయి. శరీరం సమతుల్యంగా ఉంటుంది. మంచి ఆకృతిని ఇస్తుంది.
- నడక వల్ల శరీరంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. కొవ్వు పెరగకుండా నడక కాపాడుతుంది. కాలేయ వ్యాధులు, గుండె జబ్బులు డయాబెటిస్ వంటి వాటిని నడక దూరం చేస్తుంది.
- శరీర బరువు తగ్గించుకోడానికి నడక ఒక మార్గం. ఉదయం పూట వాకింగ్ చేస్తే ఆకలి అదుపులో ఉంటుంది. నడక ఆయుష పెంచుతుంది. నడక వల్ల 20 ఏళ్ల అదనంగా జీవించవచ్చని సర్వేల్లో తేలింది.
- నడక శరీర దారుఢ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. డిప్రెషన్ విషయంలో నడక ఒక యాంటీ డిప్రెసెంటీస్‌గా పనిచేస్తుంది. క్రమశిక్షణ అలవడటంతో పాటు మానసిక స్థితి మెరుగుపడుతుంది.
- బహిరంగ ప్రదేశాల్లో సూర్యరశ్మి తగిలే ప్రదేశంలో నడవడం వల్ల శరీరంలో విటమిన డి ఉత్పత్తి మెరుగుపడుతుంది.
- కాల్వల పక్కన నడిస్తే బాడీలో ఐజీఏ ఏర్పడుతుంది. దీని వల్ల నోటి ఆరోగ్యం బాగుంటుంది. లాలాజలం ఉత్పత్తిలో ఇవి ఉపయోగపడతాయి. రోగ నిరోధక శక్తిని పెంచి ఊపిరితిత్తుల ఆరోగ్యం పనితీరును మెరుగుపరుస్తుంది.
- చురుకైన నడక వల్ల మరో ప్రయోజనం ఉంది. ఇది పేగులలోని బ్యాక్టీరియా ప్రభావాన్ని జీర్ణశక్తి పెంచుతాయి.

ఇలా నడవాలి

- తొలుత నెమ్మదిగా నడకను మొదలుపెట్టి వేగాన్ని పెంచుతూ గంటకు 6.4 కిలోమీటర్ల వేగంతో రోజూ 30 నిమషాలు పాటు నడవడం ప్రయోజనం. నడిచేందుకు సౌకర్యవంతమైన బూట్లు ఉంటే మేలు. నడిచే సమయంలో కాటన్ దుస్తులు ధరించడం మంచిది. మంచి బూట్లు ధరించి నడవడం వల్ల మోకాళ్లు, శీలమండపై ఒత్తిడి తగ్గుతుంది.

ఏ సమయంలో నడవాలి


ఇటీవల కొన్ని పరిశోధనల ప్రకారం ఉదయం 8నుంచి 11గంటలు నడిస్తే మేలని తేలింది. ఉదయం నడక మేలైనప్పటికీ పలువురు సమయాభావంతో సాయంత్రం సమయంలోనే నడుస్తున్నారు. దీనివల్ల పెద్దగా ఇబ్బందులు లేనప్పటికీ సాయంత్రం వేళ కంటే ఉదయం నడక మేలని నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పుడు ఉమ్మడి జిల్లాలోని వాకర్స్ క్లబ్‌లు నడక ప్రాధాన్యతపై విస్తృత ప్రచారం చేస్తున్నాయి. వాకర్స్ క్లబ్‌ల ద్వారా నడక ప్రాముఖ్యతను తెలియచెప్పడమే కాకుండా కొన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి



నడకపై విస్తృత ప్రచారం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 75 పైబడి వాకర్స్ క్లబ్‌లు ఉన్నాయి 1986లో సుంకర హాల్వార్‌దాస్ వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థను స్థాపించారు. ప్రపంచ వ్యాప్తంగా నేడు వేల సంఖ్యలో వాకర్స్ క్లబ్‌లు ఉన్నాయి. క్లబ్ సభ్యులు నడవడమే కాకుండా నడక ఆవశ్యకతపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. నడకతో పాటు వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు చేస్తున్నాయి. నడక సమస్త అనారోగ్యాలను దూరం చేస్తుంది. అన్ని వర్గాల ప్రజలు నిత్యం నడకద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చు.


గుంటూరి రామరాజు, వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్



నడకకు పెట్టుబడి లేదు

చిన్న పెద్ద, పేద, గొప్ప తారతమ్యం లేకుండా అందరూ నడవవచ్చు. నడకకు పెట్టుబడి లేదు. నడక వలన అనేక లాభాలు ఉన్నాయి. నడకతో మానసిక శారీరక ఆరోగ్యాలను మెరుగుపర్చుకోవచ్చు. వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్‌గా నడక ఆవశ్యకతపై విస్తృత ప్రచారం చేశాం. పౌరులు నడవాలి.. తోటివారిని నడిపించాలి. అప్పుడే సమాజంలోని పౌరులందరూ ఆరోగ్యంగా ఉంటారు. నడక వల్ల ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నాం.

కర్రా జయచరిత, డిస్ట్రిక్ట్ వాకర్స్‌క్లబ్ మాజీ గవర్నర్, పాలకొల్లు



నడక ఆయుషు పెంచుతుంది

ప్రతీరోజూ క్రమం తప్పకుండా ఉదయం ఒక గంట సేపు మట్టిరోడ్డుపై నడిస్తే ఆరోగ్యంతో పాటు ఆయుష్షు కూడా పెరుగుతుంది. నడక వల్ల రోగనిరోధక శక్తి పెంపొందుతుంది. వ్యాధుల బారిన పడకుండా మనల్ని మనమే కాపాడుకోవచ్చు. నడక సాధన చేయడంతో రోజంతా మానసికంగా ఉండడమే కాకుండా వృత్తి పనులలో కూడా చురుగ్గా ఉంటారు. ఉద్యోగులు రోజంతా కూర్చుని పనిచేసుకున్నా ఎటువంటి రోగాలు రావు.

ఇందుకూరి సీతారామరాజు, వైస్ ఎంపీపీ, పోడూరు


వేదికపై సావనీరును ఆవిష్కరిస్తున్న దృశ్యం

గిట్టుబాటు ధరలపై పోరాటానికి పిలుపు

తణుకు, జనవరి 3(ఆంధ్రజ్యోతి):వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తున్న పాలకుల విధానాలపైన, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలపైన పోరాడదామని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా అన్నారు. రైతు కూలీ సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మహాసభల సావనీరును శుక్రవారం తణుకు స్వరాజ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో దారిదీపం పత్రిక సంపాదకులు డీవీవీఎస్ వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభల్లో వైవిధ్యపూరితమైన విషయాలపై సెమినార్లను నిర్వహించారన్నారు. ప్రభుత్వాలు ఉద్దేశపూరితంగా వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయన్నారు. ప్రజలకు వాస్తవాలను వివరించి వారిని ఉద్యమాల్లోకి తీసుకు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.ఝాన్సీ మాట్లాడుతూ గత 70 ఏళ్లుగా పాలకులు అమలు చేస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాల ఫలితంగానే వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, రైతుల ఆత్మహత్యలు సాధారణ విషయంగా మారిందన్నారు. కేంద్రం తెచ్చిన మూడు రైతాంగ వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని ఆందోళన చేపట్టగా ఆ చట్టాలను రద్దు చేసినట్టే చేసి దొడ్డిదారిన అవే విధానాలను అమలు చేస్తున్నారన్నారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు సంకు మనోరమ, ఏఐటీయూసీ నాయకులు కోనాల భీమారావు, డా.రమేష్ చంద్రబాబు, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, సామాజిక న్యాయపోరాట సమితి నాయకులు మురళీకుమార్ మాట్లాడారు.

ఆర్థిక క్రమశిక్షణపై 8 నుంచి విద్యార్థులకు అవగాహన

ఏలూరు అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8, 9 10 తరగతులు చదువుతున్న బాల బాలికలకు ఆర్థిక విషయాలపై అవగాహన కల్పించేందుకు 'ఎంట్రప్రెన్యూర్‌షిప్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' (ఈఎండీపీ) పేరిట ఈ నెల 8 నుంచి మార్చి వరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. విద్యా శాఖతో కర్నాటకకు చెందిన ఎన్జీవో సంస్థ ఉదయం ఫౌండే షన్ చేసుకున్న ఎంవోయూ మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 80 హైస్కూళ్లలో ఈ ప్రోగ్రాంను అమలుచేస్తారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి చెరో 40 హైస్కూ ళ్లను ఎంపికచేశారు. ఈ కార్యక్రమం అమలుపై ఇప్పటికే మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు. పిల్లల్లో ఆర్థిక క్రమశిక్షణ, నైపుణ్యాలు, ఆర్థిక విజ్ఞానం, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలన్నది దీని ఉద్దేశంగా సమగ్రశిక్ష జిల్లా అధికార వర్గాలు తెలిపాయి. ఇవే అంశాలపై ఎంపికచేసిన హైస్కూళ్లలో నిర్దేశిత రోజుల్లో ఒక ప్రత్యేక పీరియడ్‌ను నిర్వహించి అవగాహన కల్పిస్తారు.

నిర్వాసితుల 'కల' పండింది

వ్యక్తిగత ఖాతాల్లో పరిహారం జమ

- పన్నెండేళ్లుగా పోలవరం నిర్వాసితుల నిరీక్షణ
- వ్యక్తిగత పరిహారం కోసం ఏళ్ల తరబడి డిమాండ్
- 41.15 కాంటూరు పరిధిలోనే ఈ చెల్లింపులన్నీ..
- కూటమి ప్రభుత్వ చొరవపై హర్షామోదాలు
- గత ఐదేళ్లు నాటకాలాడిన జగన్ ప్రభుత్వం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి/ కుక్కునూరు) :

పోలవరం నిర్వాసిత కుటుంబాలు ఒకటి కాదు.. రెండు కాదు. వేలాది కుటుంబాలు. ఏలూరు జిల్లా పరిధిలో పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలో అనేక గ్రామాలు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ముంపు గ్రామాలుగా మిగిలాయి. ఆయా గ్రామాల్లో కుటుంబాలకు సహాయ పునరావాసం అందజేసి ప్రత్యేక కాలనీలకు తరలించే ప్రక్రియ చాలాకాలం క్రితమే ఆరంభమైంది. కాని ఆది నుంచి ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోతున్న నిరాశ్రయులం దరినీ ఆదుకోవడానికే కేంద్ర, రాష్ట్రాలు అప్పట్లో ముందుకొచ్చాయి. ఈక్రమంలోనే ప్రాజెక్టు ఎగువన ఉన్న గ్రామాల్లో నిరాశ్రయులు ఎంతమంది అనేది అప్పట్లో లెక్క కట్టారు. ప్రతీ మండలంలోను 15 నుంచి 18 వేల కుటుంబాలు ఉన్నాయి. భూమికి భూమి, వ్యక్తిగత పరిహారం, వివాహం కాని వారికి సాయంలో తోడ్పాటు, ప్రత్యేక కాలనీల్లో గృహ సదుపాయం వంటివన్నీ ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ పరిధిలోకి చేర్చారు. ముంపు ప్రాంతాల్లో అత్యధికులు ఎస్సీ, ఎస్టీలు కాగా, మిగిలిన వారిలో బీసీ వర్గాలది మూడో స్థానం. తాత ముత్తాతల నుంచి మావూరు అంటూ బతికిన నేల నుంచి ఒక్కసారిగా కట్టుబట్టలతో వైదొలిగేందుకు ముందుగా ఆయా కుటుంబాలు ససేమిరా అన్నాయి. కాని దీర్ఘకాల ప్రయోజనాలు, రైతు అవసరాలను గుర్తించి తాము నష్టపోయినా పర్వాలేదనే నిర్ణయానికి వచ్చి సర్వం కోల్పోవడానికి సిద్ధపడ్డారు. ఒకదశలో పోలవరం ప్రాజెక్టు పరిధిలో ఎకరానికి రూ.80 వేలు కూడా పరిహారం లభించలేదు. ఆపై పదే పదే సవరణలు చేసిన తర్వాత, కేంద్రం ప్రాజెక్టు భూసేకరణ పరిధిలో మార్పులు, చేర్పులు చేయడంతో ఎకరాకు రూ.లక్షా 40 వేల నుంచి రూ.2 లక్షల 60 వేల వరకు ధర ఎగబాకింది. దీంతో పాటు ఎంత భూమి కోల్పోతారో అంతకు అంత వేరే ప్రాంతంలో నిర్వాసితులకు అప్పగించేందుకు భూమికి భూమి పథకాన్ని అమలులోకి తెచ్చారు. ప్రత్యేకించి పండ్ల తోటలు, సాగు భూములు, వాటిలో ఉన్న చెట్టు పుట్ట మోటారుతో సహా పరిహార జాబితాలో చేర్చారు. ఈ చర్యలన్నీ నిర్వాసిత కుటుంబాలకు కాస్త ఊరట కలిగించాయి. 2014లో అధికార పగ్గాలు చేపట్టిన అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు పనులు ముమ్మరం చేసింది. సమాంతరంగా నిర్వాసిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రస్తుతం ఉన్న గ్రామాల్లో వారందరికీ ప్రత్యామ్నాయంగా ప్రత్యేకంగా కాలనీలు నిర్మించడంపై శ్రద్ధ పెట్టింది. ఈక్రమంలో 2014-19 వరకు ప్రాజెక్టు పనులే కాదు నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లింపులోను వేగం పెంచారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

2004లో అధికార పగ్గాలు చేపట్టిన వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు పరిధిలో భూసేకరణకు తెర లేపింది. ఏఏ గ్రామాలు పోలవరం ప్రాజెక్టు పరిధిలోకి వస్తాయో ఆయా గ్రామాల్లో పెద్ద ఎత్తున పోలీసులను మోహరించైనా సేకరణ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకునే దిశగా సాగింది. దీంతో అప్పట్లోనే గిరిజన, గిరిజనేతర కుటుంబాలు నిరసనకు దిగాయి. ఆ తదుపరి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం నిర్వాసిత కటుంబాలకు వ్యక్తిగత పరిహారం చెల్లింపు దిశగా శరవేగంగా అడుగులు వేసింది. నిర్వాసితుల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో ఒక్కొక్కరికి వ్యక్తిగత పరిహారం కింద రూ.6 లక్షల 86 వేలు, బీసీ, ఓసీలకైతే ఒక్కొక్కరికి వ్యక్తిగత పరిహారం కింద రూ.6 లక్షల 36 వేలు చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు తాజాగా పన్నెండేళ్ల తర్వాత వ్యక్తిగత పరిహారం చెల్లింపునకు మోక్షం లభించింది. ముంపు మండలాలైన పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడుతో సహా మిగతా ప్రాంతాల్లోను పరిహారం శుక్రవారం వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యింది. దీంతోపాటు పునరావాస కాలనీల్లో ఇల్లు వద్దనుకునే వారికి ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల 85 వేలు, అదే కాలనీలో స్థలం కూడా వద్దనుకునేవారికి రూ.లక్ష చొప్పున ఇంతకుముందే ప్రకటించిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా పరిహారం తాజాగా నిర్వాసిత కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ఆరంభమైంది. వాస్తవానికి దీనికోసమే కళ్లల్లో ఒత్తులేసుకుని వేలాది మంది ఎదురు చూశాు. ముంపు మండలాల్లో ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించడానికి రంగం సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం పూర్తిగా చొరవ తీసుకుని నిర్వాసిత కుటుంబాలకు మొదటి నుంచి చెబుతున్నట్టుగానే వ్యక్తిగత పరిహారం చెల్లింపు దిశగా తమ పూర్తి మద్దతు ఇచ్చినట్టయ్యింది. ప్రత్యేకంగా గిరిజన, గిరిజనేతర కుటుంబాలు వ్యక్తిగత పరిహారం విషయంలో వివిధ రాజకీయ పక్షాలు ఎన్నికలు వచ్చిన ప్రతీసారి చెలగాటమాడాయి. కాని కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నేతృత్వంలో పోలవరం పూర్తి చేయాలన్న తపన, లక్ష్యంతో దీనికి సమాంతరంగా నిర్వాసిత కుటుంబాలకు చెల్లించాల్సిన పరిహారం విషయంలో రాజీ పడకుండా చొరవ చూపినట్టయ్యింది. ప్రత్యేకించి తాజాగా వ్యక్తిగత పరిహారాన్ని బ్యాంకుల్లో జమ చేసేలా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశించింది. ఒక్క పోలవరం మండలంలోనే పరిహారం చెల్లింపునకు రూ.15 కోట్లకు పైగా నిధులు అందుబాటులోకి వచ్చాయి. కుక్కునూరు, వేలేరుపాడుల్లో దీనికి కాస్త రెట్టింపు సంఖ్యలోనే పరిహారం జమ చేయడం ఆరంభమైంది.


కుక్కునూరులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో సంబరాలు

పరిహారంలో అప్పుడు జగన్నాటకాలెన్నో!

2019 ఎన్నికల్లోను, ఆ తర్వాత కూడా వైసీపీ వ్యక్తిగత పరిహారం పేరిట తెగ నాటకాటకాలాడారు. ఓట్లు దండుకోవడానికి విశ్వప్రయత్నాలు చేశారు. 2019లో ఈ నాటకాలకు లొంగిన అనేకమంది వైసీపీ పక్షాన నిలిచి అప్పట్లో పోలవరంలో తిరుగులేని మెజార్టీ వైసీపీకి కట్టబెట్టారు. అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత కూడా వ్యక్తిగత పరిహారం రూ.పది లక్షలకు పెంచుతామని వైసీపీ ప్రభుత్వం గొప్పలకు పోయిం ది. 2024 ఎన్నికలకు ఆరు నెలలు ముందే మరోసారి పరిహారం పెంచి ఆ సొమ్ము అంతా జమ చేస్తున్నట్టుగా ఒకరిద్దరి ఖాతాల్లోనే వేసి మిగతా వారిని వలలో వేసుకునే ప్రయత్నాలు చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మం డలాల్లో అప్పుడు సీఎం హోదాలో జగన్ పర్యటనకు వచ్చినప్పుడు నిర్వాసితులు ఎవరూ రెచ్చిపోకుండా జాగ్రత్తలు పడ్డారు. వైసీపీ పాలన ఐదేళ్లు నిర్వాసిత కుటుంబాలతో చెలగాటమాడారు. ఎవరికీ పరిహారం అందకపోగా ఇదంతా ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి వైసీపీ పన్నాగంగా గమనించి 2024 ఎన్నికల్లో వైసీపీకి చుక్కలు చూపించారు.

41.15 కాంటూరు పరిధిలోనే..

పోలవరం ప్రాజెక్టు 41.15 కాంటూరు లెవెల్‌లోనే ముంపునకు గురవుతున్న గ్రామాల్లోని ఇళ్లకు వ్యక్తిగత పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఆయా మండలాల్లో పునరావాస జాబితాలో ఉన్న కుటుంబాల్లో పరిహారం చెల్లింపును ఆరంభించారు. నిర్వాసిత కుటుంబాలకు చాలాకాలం తర్వాత పరిహారం బ్యాంకుల్లో జమ అవ్వడం దాదాపు ఇదే ప్రథమం. కుక్కునూరు మండలం కుక్కునూరు 'ఏ' బ్లాక్, కివ్వాక, చీరవల్లి, దామరచర్ల, గుంపేనపల్లి, రామచంద్ర పురం ముంపు గ్రామాల్లో నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం సొమ్ము జమ అయ్యింది. వేలేరుపాడు మండలం వేలేరుపాడు, రేపాకగొమ్ము, జగన్నాథపురం, నడిమిగొమ్ము, తాట్కూరుగొమ్ము గ్రామాల్లో నిర్వాసితుల ఖాతాల్లో జమ అయ్యింది. పోలవరం కాంటూరు లెవెల్ కేవలం 41.15 పరిధిలోకి వచ్చే ముంపు గ్రామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పరిహారం చెల్లింపు దిశగా అడుగులు వేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ పరిహారం చెల్లింపులు పూర్తి చేయాలన్న లక్ష్యంలో ఉన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి లెవెల్ 45.75 కాంటూరు లెవెల్‌లో పరిస్థితి ఏమిటనేది ఇప్పుడు కొత్త ప్రశ్నగా మారింది. అయితే ముందస్తుగా దఫాల వారీగా పరిహారం చెల్లించడం కొంతలో కొంత నిర్వాసిత కుటుంబాలను ఆదుకున్నట్టవుతుంది. ఈ దిశగానే కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా పాలాభిషేకాలు చేశారు. నిర్వాసిత గ్రామాల్లో అనేకమంది ఆనందం పట్టలేక నృత్యాలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని వెయ్యినోళ్ల పొగిడారు.

సర్వత్రా హర్షం

పరిహారం చెల్లింపు చంద్రబాబుకే సాధ్యం


గతంలో భూములకు పరిహారం ఇచ్చిన ఘనత చంద్రబాబుది. మళ్లీ నిర్వాసితులందరికీ అన్ని రకాల పరిహారం అందించడం చంద్రబాబుకే ఘనత దక్కింది. ఎన్నో ఏళ్ళుగా నిర్వాసితులకు పరిహారం అందక బాధ అనుభవిస్తున్నారు. ఇప్పుడు పరిహారం అందడంతో నిర్వాసితులకు మేలు జరుగుతుంది. చంద్రబాబుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాం.
- ములిశెట్టి నాగేశ్వరరావు, టీడీపీ కుక్కునూరు మండలాధ్యక్షుడు

నిర్వాసితులకు పవన్ తోడ్పాటు


నిర్వాసితుల సమస్యలను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన తోడ్పాటుతో ఈ రోజు నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమ అవుతోంది. గత ప్రభుత్వం నిర్వాసితులను ఏ మాత్రం పట్టించుకోలేదు. పరిహారం జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కింది.
- ఎం.యుగంధర్, జనసేన కుక్కునూరు మండల పార్టీ అధ్యక్షుడు

న్యాయం జరిగింది..



నా బ్యాంకు ఖాతాలో వ్యక్తిగత పునరావాస పరిహారం కింద రూ.6లక్షల 36 వేలు జమ అయ్యింది. 2022 గోదావరి వరదలకు మా ఇల్లు మొత్తం కొట్టుకుపోవడంతో రెండేళ్లగా పునరావాస కాలనీలోనే నివాసం ఉంటున్నాను. అప్పటి నుంచి ప్యాకేజీల కోసం ఎదురు చూస్తున్నాం. ఇన్ని రోజుల తర్వాత మాకు పరిహారం అందడంతో న్యాయం జరిగింది.
- పటాన్ వల్లిబాషా, కుక్కునూరు 'ఏ' బ్లాక్ నిర్వాసితుడు

ఏళ్ల తరబడి బాధ పడుతున్నాం


నేను కుక్కునూరు ఏ.బ్లాక్ నిర్వాసితుడిని. ఏటా గోదావరి వరదలు రావడం ఇళ్లు ఖాళీ చేసి పునరావాస కాలనీకి వెళ్లాల్సి వస్తోంది. మళ్లీ గోదావరి వరదలు తగ్గిన తర్వాత ఇంటికి వస్తున్నాం. ఈ క్రమంలో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నాం. ఏళ్ళ తరబడి ఇక్కడ ప్రతీ నిర్వాసితుడు బాధలకు గురవుతున్నవాడే. మళ్లీ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వచ్చింది నిర్వాసితులకు మేలు జరుగుతోంది.
- పిచ్చుక రాజు, ఉప సర్పంచ్, కుక్కునూరు

ఇనామ్ భూముల రిజిస్ట్రేషన్ బంద్

రైతుల గగ్గోలు


రిజిస్ట్రేషన్ డేటాలో వెబ్‌ల్యాండ్ డిటేల్స్ వచ్చి సర్వీసు ఇనామ్ ఫ్రీ హోల్డ్ అని ల్యాండ్ నేచుర్ వచ్చిన దృశ్యం

ఆచంట, జనవరి 3(ఆంధ్రజ్యోతి):పూర్వపు రోజుల్లో ఆయా గ్రామాల్లో ఉన్న కొన్ని భూములను కొంత మంది కుల వృత్తిదారులకు భూములు ఇచ్చి వాటిని ఇనామ్ భూములుగా పిలిచేవారు. అయితే ఈ భూములకు సంబంధించి అప్పట్లోనే పాస్ బుక్‌లు రావడం, దాంతో అనేక సార్లు క్రయ విక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో ఈ భూములను పలువురు అమ్మేవారు. మరికొంత మంది కొనుక్కునేవారు. దీంతో ఎటువంటి ఇబ్బంది కూడా లేకుండా పోయింది. ఇటీవల రిజిస్ట్రేషన్ నిమిత్తం కొన్ని గ్రామాల్లో ఇచ్చిన ఇనామ్ భూములకు సంబంధించి రెవెన్యూ అధికారులు జారీ చేసిన 1బి ఫారంలో సర్వీస్ ఇనామ్ భూమి అంటూ రావడం జరిగింది. దీంతో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. మరలా రెండు రోజుల నుంచి రెవెన్యూ అధికారులు జారీ చేసిన 1బి ఫారంలో మాత్రం సర్వీసు ఇనామ్ అనే పదం రానప్పటికి రిజిస్ట్రేషన్ నిమిత్తం డేటాలో మాత్రం విలేజ్‌సర్వీస్ ఇనామ్ మేడ్ ఫ్రిహోల్ట్ ఇన్ 2023 అని వస్తుండటంతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు రిజిస్ట్రేషన్‌లు చేయడం లేదు. రెవెన్యూ అధికారులు తొలగించినప్పటికి రిజిస్ట్రేషన్‌శాఖ డేటాకు సంబంధించి సాఫ్ట్‌వేర్‌లో మాత్రం ఇలా వస్తుండటంతో కొన్ని రోజులుగా ఇటువంటి భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. వీటికి సంబంధించి ఇటీవల అనేక మంది ఈ భూములను కూడా కొనుగోలు చేసుకుని రిజిస్ట్రేషన్ నిమిత్తం చలానాలు కూడా కట్టేశారు. కొన్ని సంవత్సరాల క్రితమే ఈ భూములను తాము కొనుగోలు చేసుకుని ఇపుడు అవసరం నిమిత్తం అమ్ముకుందామన్నా ఇనామ్‌భూమి అనే పదం రావడం వల్ల రిజిస్ట్రేషన్‌లు జరగడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకుని రిజిస్ట్రేషన్‌లు సజావుగా అయ్యేటట్లు చూడాలని రైతులు కోరుతున్నారు.

డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన

ఏలూరు క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థకు ప్రజల్లో ఉన్న మంచిపేరును భవిష్యత్తులో కూడా నిలబెట్టి ఉత్తమ సేవలు ప్రయాణికులకు అందించాలని జిల్లా ట్రాన్స్‌పోర్టు డిప్యూటీ కమిషనర్ షేక్ కరీమ్ అన్నారు. రోడ్డు భద్రత ట్రైనింగ్‌లో భాగంగా జిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలో ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీటీసీ షేక్‌కరీమ్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడపరాదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని, రోడ్డు భద్రతా ప్రమాదాలపై అవగాహన పెంచుకుని సురక్షితంగా డ్రైవింగ్ కొనసాగించాలన్నారు. ప్రజలలో ఆర్టీసీపై నమ్మకం ఉందని సురక్షితమైన, సుశిక్షితులైన డ్రైవర్లు ఉన్నారనే పేరు ఉందని దీనిని భవిష్యత్తులో కొనసాగించి ప్రయాణికులకు సేవలు అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ రివ్యూ మీటింగ్‌లో వచ్చిన పలు అంశాలను డ్రైవర్లకు వివరించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీపీటీవో ఎస్‌వీఆర్ వరప్రసాద్, ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, జిల్లాలోని జంగారెడ్డిగూడెం, నూజివీడు, ఏలూరు డిపోలకు చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

6న సెన్సిటివ్ జోన్‌పై గ్రామసభలు

భీమవరం టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు, ఉండి, పెంటపాడు, గణపవరం, కాళ్ల మండలాల్లో ఏకో సెన్సిటివ్ జోన్ ఖరారుపై ఈ నెల 6న గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏకో సెన్సిటివ్ జోన్ జిల్లా మానిటరింగ్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కొల్లేరు అభయారణ్యం చుట్టుపక్కల జోన్ ఖరారు చేయడం కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించి అవగాహన కల్పించడంతోపాటు ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తారని తెలిపారు. 6న ఆకివీడు మండలంలో మధ్యాహ్నం 1 గంట నుంచి ఐదు గంటల వరకు, మిగిలిన మండలాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు గ్రామసభలు జరుగుతాయన్నారు. కొల్లేరు పరిధిలోని ప్రజలు గ్రామసభలకు హాజరై అభిప్రాయాలు తెలపాలని కోరారు.

క్రైమ్ కార్నర్

కాల్వలో వృద్ధుడి మృతదేహం

పెంటపాడు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రత్తిపాడు గ్రామానికి చెందిన ఆకుల చిన ఆదినారాయణ(65) సమీపంలోని ఏలూరు కాలువలో గేదెలను కడిగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి గల్లంతైన విషయం పాఠకులకు విదితమే. ఈ ఘటనలో వృద్ధుడి మృతదేహం శుక్రవారం కాలువలో లభ్యమైనట్లు పెంటపాడు ఎస్‌ఐ స్వామి తెలిపారు. మృతదేహానికి తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భీమడోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం గుంటపల్లి గ్రామానికి చెందిన గుబ్బ తిరుపతిస్వామి (బాబ్జీ 56)తో పాటు అతని బంధువులు మారుతి ఎట్రికా కారులో తిరుమల తిరుపతి దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ఈనెల 3వ తేదీన ఏలూరు జిల్లా భీమడోలు మండలం కొండ్రెడ్డినగర్ సమీపంలో జాతీయ రహదారిపై ట్రాలీ వెళుతుండగా ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో కారు లారీని ఢీ కొంది. ఈ ప్రమాదంలో తిరుపతిస్వామికి గాయాలు అయ్యాయి. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ స్వామి మృతి చెందాడు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

కల్యాణ కట్ట వద్ద మాంస భక్షణ

డ్రైవర్‌ను నిలదీసిన భక్తులు


ద్వారకాతిరుమల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రంలో కల్యాణకట్ట (కేశఖం డనశాల) వద్ద శుక్రవారం ఓ టూరిస్టు డ్రైవర్ మద్యం తాగి, చికెన్ తినడం సంచలనాన్ని రేకెత్తించింది. వరంగల్‌కు చెందిన కొందరు విద్యార్థులు ఉదయం ద్వారకా తిరుమల క్షేత్రానికి విచ్చేశారు. కేశఖండనశాల సమీపంలో బస్సు నిలిపి వారు వంట చేసుకుంటున్నారు. ఈక్రమంలో ఓ విద్యార్థి తెచ్చుకున్న లంచ్ బాక్స్‌లోని మాంసాన్ని అతని వద్ద నుంచి తీసుకుని డ్రైవర్ తింటున్నాడు. దీంతో పాటు మద్యాన్ని సేవిస్తున్నాడు. దీన్ని గమనించిన కొందరు భక్తులు ఇదేంటని డ్రైవర్‌ను నిలదీశారు. ఎంతో పవిత్రమైన ప్రదేశంలో మద్యం, మాంసం తినడం ఏంటంటూ ఆగ్రహానికి లోనయ్యారు. ఈ వివాదాన్ని తెలుసుకున్న ఆలయ అధికారులు సిబ్బంది, అక్కడకు చేరుకుని డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు పంపించారు.

మహిళా అభ్యర్థులకు స్పోర్ట్స్ ఈవెంట్స్

102 మంది అర్హత

ఏలూరు క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి):పోలీసు కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్‌లో భాగంగా మహిళా అభ్యర్థినులకు శుక్రవారం ప్రత్యేకంగా స్పోర్ట్స్ ఈవెంట్స్ నిర్వహించారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో తెల్లవారుజాము నుంచే ఈ పరీక్షలను చేపట్టారు. శుక్రవారం 490 మంది మహిళా అభ్యర్థినులు హాజరు అవ్వాలని హాల్‌టిక్కెట్లు జారీ చేయగా 242 మంది మాత్రమే హాజరయ్యారు. వారిలో 102 మంది స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో అర్హత సాధించారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ అభ్యర్థినులకు పలు సూచనలు ఇచ్చారు. దేహదారుఢ్య పరీక్షల నిర్వహణకు సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్ కెమెరాల ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. శనివారం కూడా మహిళా అభ్యర్థినులకు స్పోర్ట్స్ ఈవెంట్స్ నిర్వహిస్తారు.



అభ్యర్థి ఎత్తును పరిశీలిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

తల్లిదండ్రులు మందలించారని విద్యార్థిని ఆత్మహత్య


ధరణి మృతదేహం

ఏలూరు క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి):సరిగా చదవకపోవడంతో మార్కులు రావడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఒక విద్యార్థిని శుక్రవారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరులోని బావి శెట్టి వారిపేటకు చెందిన సింహాద్రి షణ్ముకాచారి కార్పెంటర్. అతనికి భార్య శ్రీదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె ధరణి(14) పవర్‌పేటలోని దీప్తి స్కూలులో చదువుతుంది. చిన్న కుమార్తె హిమశ్రీ కూడా స్కూలుకు వెళ్తుంది. శ్రీదేవి కూడా దీప్తి స్కూల్‌లోనే టీచర్‌గా పనిచేస్తున్నారు. ధరణి ఇటీవల ప్రోగ్రెస్ కార్డులో మార్కులు తక్కువగా రావడంతో తల్లిదండ్రులు బాగా చదవాలని మందలించారు. దీంతో ఆమె మనస్తాపానికి గురైంది. శుక్రవారం ఉదయం షణ్ముకాచారి తన చిన్న కుమార్తెను, భార్యను స్కూలులో దించి రావడానికి వెళ్ళారు. ధరణి స్కూల్ యూనిఫామ్ ధరించి సిద్ధంగా ఉంది. అయితే తండ్రి తిరిగి వచ్చేటప్పటికి ధరణి ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా మృతి చెందిందని నిర్ధారించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్కూల్ పిల్లల ఆటో బోల్తా

ఐదుగురికి గాయాలు



నరసాపురం టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నరసాపురం- మొగల్తూరు జాతీయ రహదారిలోని రుస్తుంబాదా బల్లకట్టు వద్ద శుక్రవారం స్కూల్ పిల్లలతో వస్తున్న ఆటో అదుపు తప్పి హైవే రోడ్డు పక్కన ఉన్న గోతుల్లో పడింది. ఆ సమయంలో ఆటోలో డ్రైవర్‌తో పాటు ఏడుగురు పిల్లలు ఉన్నారు. ఎనిమిది అడుగుల పైనుంచి పడినా... ఎవరికి ప్రమాదం జరగలేదు. చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తే భారీ ప్రమాదం జరిగినట్లు కనిపిస్తుంది. ఆటో నుజ్జునుజ్జు అయింది. గాయపడిన పిల్లల్ని పట్టణంలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించి చికిత్స చేశారు. విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రికి వచ్చి పిల్లల్ని ఇంటికి తీసుకెళ్లారు. అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలపై ఆరా తీశారు. టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురోహితుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా శుక్రవారం రాత్రి ఒక పురోహితుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు సమీపంలోని వట్లూరులో ఉన్న ఇంద్రప్రస్థలో గంటసాల విశ్వనాథ వెంకట సత్యనారాయణ (40) పౌరోహిత్యం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు త్రి టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

30 కాసుల బంగారం, 50 వేల నగదు అపహరణ

భీమవరం క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఊరు వెళ్ళిన ఒక కుటుంబం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు బద్దలుకొట్టి ఇంట్లో ఉన్న బంగారం, నగదును దోచుకువెళ్ళిన సంఘటన భీమవరంలో సంచలనమైంది. భీమవరం టూటౌన్ సీఐ కాళీచరణ్ తెలిపిన వివరాల ప్రకారం కాస్మో క్లబ్ రోడ్డులో నివాసం ఉంటున్న కూనం రాంబాబు గత ఏడాది డిసెంబర్ 20వ తేదీన శుభకార్యం నిమిత్తం కుటుంబంతో సహా ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్ వెళ్ళాడు. అక్కడి నుంచి ఈ నెల 2వ తేదీన భీమవరం వచ్చారు. ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు బద్దలుకొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్ళి చూడగా బీరువా తాళాలు కూడా బద్ధలుకొట్టి అందులో ఉన్న 30 కాసుల బంగారు వస్తువులు, రూ. 50 వేల నగదు గుర్తు తెలియని దుండగులు దోచుకువెళ్ళడంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కాళీచరణ్ తెలిపారు.

కలుపు మందు తాగి యువకుడి ఆత్మహత్య

టి.నరసాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీగుంట పంచాయతీలోని శ్రీరామవరం గ్రామానికి చెందిన గనిశెట్టి మణికంఠ స్వామి (21) జంగారెడ్డిగూడెం శంకరీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. తరచూ కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో డిసెంబరు 31వ తేదీ కడుపునొప్పి తాళలేక కలుపు మందు తాగి వాంతులు చేసు కోవడంతో కుటుంబసభ్యులు గమనించి జంగారెడ్డిగూడెం హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఈ నెల 1న రాజమండ్రి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుని తండ్రి గనిపెట్టి రాజేష్ ఫిర్యాదుతో హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే చంటి


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, జనవరి3 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే బడేటి చంటి హామీ ఇచ్చారు. శుక్రవారం 4వ డివిజన్ మారుతీనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న రోడ్లు, డ్రెయినేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీటి సమస్య ఉందని చెప్పడంతో సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించామని నిధులు మంజూరైన వెంటనే చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ భానుప్రతాప్, చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, ఆర్నేపల్లి తిరుపతి, పూజారి నిరంజన్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్హత కలిగిన వారికి నూతనంగా పింఛన్లు, ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.

9 నుంచి క్రికెట్ పోటీలు

ఏలూరు రూరల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని యువతను ప్రోత్సహించేందుకు ఈనెల 9 నుంచి 16వ తేదీ వరకు ఏలూరు సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు శేఖర్, హరి, వెంకట్, వినయ్‌గణేష్ తెలిపారు. శుక్రవారం సంబంధిత పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నగర యువత క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం మంచి నిర్ణయం అన్నారు. వివరాలకు 94413 30087 నంబరులో సంప్రదించాలని క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ కమిటీసభ్యులు తెలిపారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌టీయూ ఏలూరు జిల్లా శాఖ క్యాలెండర్, డైరీని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం ఆవిష్కరించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు పీఆర్‌టీయూ సంఘం చేస్తున్న కార్యకలాపా లను జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, కలెక్టర్‌కు వివరించారు. పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థుల పట్ల తీసుకుంటున్న ప్రత్యేక ప్రణాళిక అమలు వివరించి, ఈసారి పది ఫలితాలు మెరుగ్గా రావడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ప్రస్తావించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు బెజవాడ ధర్మారావు, సయ్యద్ ముర్మలిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సొంతింటి కల నెరవేరుస్తాం : పత్సమట్ల

ఉంగుటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కుటుంబానికి సొంత ఇంటి కలతో పాటు, సురక్షిత మంచినీటిని అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు క్యాంపు కార్యాలయంలో రక్షిత మంచి నీటి పథకంతో పాటు గృహనిర్మాణశాఖ అధికారులతో సమీక్ష జరిపారు. గత ప్రభుత్వ సమయంలో రద్దు కాబడిన గృహ నిర్మాణ పనులను గుర్తించాలని కోరారు. శిథిలావస్థకు చెందిన తాగునీటి సరఫరా పథకాల మరమ్మతుల విషయంలో శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్, గృహ నిర్మాణ శాఖ డీఈఈలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

జైపాల్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి : చిర్రి


జైపాల్‌సింగ్ చిత్రపటం వద్ద ఎమ్మెల్యే బాలరాజు నివాళులు

బుట్టాయగూడెం/జీలుగుమిల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ జాతిపిత జైపాల్ సింగ్ ముండాను ఆదివాసీలంతా ఆదర్శంగా తీసుకుని విజయాలు సాధించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు. శుక్రవారం సింగన్నపల్లి కాలనీలో జైపాల్‌సింగ్ ముండా జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఆదివాసీల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని మరువరాదని తెలిపారు. డిసెంబరు 10 నుంచి జనవరి 3వ తేదీ వరకు గ్రామాల్లో హక్కుల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించడం శుభదాయకమని తెలిపారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆదివాసీ ఎన్ఆర్ సైంటిస్టు కొవ్వాసి సూర్య ప్రకాశ్‌ను ఘనంగా సత్కరించారు. నాయకులు మొడియం శ్రీనివాసరావు, కాకి మధు, కుర్సం దుర్గారావు, కొవ్వాసి శ్రీనివాస రావు, చిర్రి దేవరాజు, తెల్లం లక్ష్మణ్, సోదెం ముక్కయ్య, ఎస్.రామ్మోహన్, లక్ష్మణరావు, కూరం రమేష్, సర్పంచ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

జీలుగుమిల్లి నుంచి పి.రాజవరం వెళ్లే రహదారిని రూ.70 లక్షల ఉపాధి హామీ నిధులతో చేపట్టే పనులను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రారంభించారు. త్వరలో పేదల ఇళ్ల నిర్మాణం కోసం జాబితా తయారు చేసి నియోజకవర్గంలో ఇళ్లు లేని వారికి మంజూరు చేస్తామన్నారు. జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి గడ్డమణుగు రవికుమార్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పసుపులేటి రాము, ఎంపీపీ కోర్స పోశమ్మ, సర్పంచ్ చిర్రి జగదాంబ, నాయకులు వీరాబత్తుల ధనుంజయ, కోలా మధు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి : ఎమ్మెల్యే మద్దిపాటి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): గోపాలపురం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు మౌలిక సదుపాయాలు అందించడంలో విఫలమవుతున్నట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నల్లజర్లలో నియోజకవర్గ అభివృ ద్ధిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు పూర్తిస్థాయిలో పనిచేస్తే అందరికీ మౌలిక సదుపాయాలు అందించవచ్చని, అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆరు నెలల్లో రూ.55 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించినట్టు తెలిపారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఇప్పటి వరకు రూ.2 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ అందించామన్నారు.

సచివాలయ సిబ్బంది పని తీరు బాగోలేదు

సచివాలయ సిబ్బంది పని తీరు బాగోలేదని, కొంతమంది సచివాలయానికి వారి ఇష్ట ప్రకారం వచ్చి కుర్చీల్లో కాళ్ల పెట్టుకుని సెల్‌ఫోన్‌లో చాటింగ్ చేసుకుంటున్నారన్నారు. ప్రజలకు కనీస సేవలు అందించలేకపోతున్నారన్నారు. నియోజకవర్గంలోని 250 పాఠశాలల్లో క్రీడా సామగ్రి కొనుగోలు చేసి ప్రతి వారం క్రీడలకు ప్రత్యేక సమయం కేటాయిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిలో రాష్ట్రంలో 'ఉమ్మడి పశ్చిమ' సెకండ్

ద్వారకాతిరుమల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాల ఉత్పత్తిలో ఉమ్మడి పశ్చిమ గోదావరి రెండో స్థానంలో ఉందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఎం.నాగులపల్లిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాడి పశువుల్లో గర్భకోశవ్యాధుల ఉచిత చికిత్సా వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రూ.15లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రహదారిని ప్రారంభించారు. ఉభయగోదావరి జిల్లాలో రైతులు పాడి పరిశ్రమ ద్వారా రోజుకు ఐదు లక్షల లీటర్లను ఉత్పత్తి చేయగలుగుతున్నారన్నారు. నేతలు లంకా సత్తిపండు, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, పాకలపాటి గాంధీ, పోలిన శ్రీను, ఏపూరి దాలయ్య, పాతూరి సహృదయ్, ఎంపీడీవో పీవీపీ ప్రకాశ్, పశువైద్య అధికారులు టి.గోవిందరాజు, సాయి రమేష్, అంగర సురేష్ పాల్గొన్నారు.

సంక్రాంతి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, ఇంజనీర్లు, కవులు, రచయితలు, మేధావుల ప్రతిభను, సేవలను గుర్తించి, వారిని 'సంక్రాంతి విశిష్ట ప్రతిభా పురస్కారం-2025' లతో సత్కరించేందుకు అర్హులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు 'సర్వేజనా.. సుఖినో భవంతు' అకాడమీ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్.ఎస్.నారాయణ మాస్టారు ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత రంగాల్లో సేవలందిస్తున్నవారు ప్రతిభను తెలిపే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలతో నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలను దరఖాస్తుకు జతచేసి ఈనెల పదో తేదీలోగా 'సర్వేజనా.. సుఖినోభవంతు', డోర్ నెంబరు 1-20-164. తిరుమలగిరి పోస్టు, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపాలని సూచించారు. ఎంపికైన వారికి ఈ నెల 19న హైదరాబాద్‌లో అవార్డులను అందజేస్తామన్నారు. వివరాలకు 96523 47207 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయులకు క్యారేజి బ్యాగుల అందజేత

ఉంగుటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం మండల విద్యా వనరుల శాఖ కార్యాలయంలో సంఘ ప్రతినిధులు మండలంలోని ఉపాధ్యాయులకు క్యారేజి బ్యాగులను అందించారు. ఈ బ్యాగులు వితరణ చేసిన పీవీ అప్పారావు, సునీల్, బేబీ సరోజిని, తోట మూర్తిరాజులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీధర్, శీతాల సత్యనారాయణ, మండల సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉనుముల రాంబాబు, జోగి నాయుడు పాల్గొన్నారు.

మహనీయురాలు సావిత్రీబాయి పూలే

వాడవాడలా జయంతి వేడుకలు.. చిత్రపటాలు, విగ్రహాల వద్ద ప్రముఖుల నివాళులు


ఏలూరు శ్రీరామ్‌నగర్ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు


జంగారెడ్డిగూడెంలో రిటైర్డ్ మహిళా ఉపాధ్యాయులకు సత్కారం

ఏలూరు రూరల్/ఏలూరు టూటౌన్/ ఏలూరు అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహిళల సమస్యలకు పరిష్కారమార్గం చూపిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని ఏపీ బీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.పి.ఆర్ విఠల్‌కుమార్, రాష్ట్ర కన్వీనర్ పామర్తి ఏసురాజు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఏలూరు జిల్లా పరిషత్ వద్ద వున్న జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ సంఘం నాయకురాలు మొతిక రాఘవ ఆధ్వ ర్యం లో పూలే చిత్రపటం వద్ద నివాళుల ర్పించారు. బీసీ కులాల జేఏసీ ఛైర్మన్ లంకా వెంకటేశ్వ రరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలా చారి, ఉక్కుసూరి గోపాలకృష్ణ, దేవరకొండ వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, కె.కన్నబాబు, ఆర్డీసీ నాయకులు షేక్ కాశీం పాల్గొ న్నారు.

- పూలే ఆశయసాధనకు పునరంకితం అవుదామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు పేర్కొన్నారు. జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు పి.ఏసురాజు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.
- నగరంలోని శ్రీరామ్‌న గర్ ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం బేతాళ సుదర్శనం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ గిరిబాబు అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కళాశాల మహిళా సాధికారత విభాగం కో-ఆర్డినేటర్ కావ్యశ్రీ, అధ్యాపకులు వెంకట్రావు, కృష్ణచైతన్య, పద్మావతి, పరమేశ, వెంకట దుర్గాప్రసాద్, సుజాత తదితరులు పాల్గొన్నారు. స్థానిక జడ్పీ కార్యాలయ సమీపంలోవున్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి పీడీఎస్‌యూ జిల్లా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కె.నాని, యశ్వంత్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.
- బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఫెడరేషన్ కార్యాలయంలో పూలే జయంతి నిర్వహించారు. రిటైర్డ్ తహసీల్దార్ నాగేశ్వరరావు, మాధవరావు, మితిలేష్, తేజ, సౌజన్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- ఏలూరు/కామవరపుకోట : విద్యార్థినులు, మహిళలకు సావిత్రిబాయి పూలే ఆదర్శమని జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతి కార్యక్రమాన్ని స్థానిక బుట్టాయగూడెం రోడ్డులోని ప్రభుత్వ పాఠశాల పక్కన వున్న పూలే విగ్రహానికి ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రిటైర్డ్ మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. బీసీ సంఘ నాయకులు బత్తిన చిన్నా, సీహెచ్.బుచ్చియ్యచారి, షేక్ ముస్తఫా, రాజాన పండు, అయినాల రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పూలే విగ్రహానికి హెచ్ఎం లోవకుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.
- కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వ రరావు, ఎన్ఎస్ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ గిరి శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, దారావతు మల్లేష్, తదితరులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యాల యంలో పూలే చిత్రపటానికి సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు, షేక్ ఇబ్రహీంలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీను, తాడిగడప సీతారామరాజు పాల్గొన్నారు.
- ఉంగుటూరు : ఉంగుటూరు ఎంపీపీ పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతి కార్యక్రమంలో వెలుగు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, ఎంపీటీసీ పెనుగొండ బాలకృష్ణ పాల్గొన్నారు. ఎం.ప్రశాంతి, సరోజిని, టి.సుభాషిణిలను సంస్థ తరఫున సత్కరించారు.
- చింతలపూడి :స్థానిక మేడబడి సెంటర్‌లో ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద జయంతి కార్యక్రమాన్ని మానవత స్వచ్ఛంద సంస్థ, బీసీ ఎంప్లాయీస్, టీడీపీ నాయకులు నిర్వహించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పూలే జయంతిని నిర్వహించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అడిషనల్ ఎస్పీ

ఐవైఎం సేవలు ప్రశంసనీయం

ఏలూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఐడియల్ యూత్ మూమెంట్ (ఐవైఎం) సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. మత్తుపదార్థాలు, అశ్లీలతకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమ కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఐవైఎం కృషిని కొనియాడారు. సంస్థ నగర అధ్యక్షుడు షేక్ ఖాదర్, సెక్రటరీ మహ్మద్ రఫీ, సభ్యులు జోజిబాబు, ఎమ్డీ అసదుల్లా, బషీర్, అంజాద్, షఫీవుల్లా, ఎం.డి. ఉస్మాన్ పాల్గొన్నారు.


విజేతను అభినందిస్తున్న క్రీడా అధికారులు

స్విమ్మింగ్‌లో పతక విజేతకు సత్కారం

ఏలూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ స్విమ్మింగ్ పోటీల్లో 50 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించిన ఏలూరు శ్రీసూర్య ఇంగ్లీష్ మీడియం ఆరో తరగతి విద్యార్థి బలగాస్వామినాయుడికి శుక్రవారం ఘనంగా సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా క్రీడాభివృద్ధిశాఖ అధికారి బి.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల డైరెక్టర్ కొండపల్లి చంద్రశేఖర్, లక్ష్మి మాట్లాడారు. బలగాస్వామినాయుడికి రూ.10వేలు నగదు పురస్కారం అందించారు.

రిటైర్డ్ హెచ్ఎం జగ్గారావుకు పూలే సేవా పురస్కారం

ఏలూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన విశ్రాంత హెచ్ఎం గడా జగ్గారావు విద్యారంగంలో అందించిన సేవలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా సావిత్రిబాయి పూలే విశిష్ట సేవా పురస్కారం-2025ను అందుకున్నారు. శుక్రవారం గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో జరిగిన సభలో అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం, సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషన్ సొసైటీ చారిటబుల్ ట్రస్ట్-విశాఖపట్టణం వారి ఆధ్వర్యంలో పురస్కారాన్ని అందుకున్నట్లు జగ్గారావు ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ ప్రతినిధులు కె.సత్యకుమార్, ఆ సంఘ వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

లింగపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉపయోగకరమని, వీటి ద్వారా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో రామారావు సూచించారు. శుక్రవారం మండలంలో ఉన్న ఎనిమిది ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 394 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఎంఈవో-2 జంగం రవీంద్ర, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పిచికారీపై అవగాహన

ఉంగుటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు డ్రోన్ ద్వారా పురుగుమందుల స్ప్రేయింగ్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ ముండ్రు శాంతి ఆధ్వర్యంలో స్ప్రేయింగ్ చేయించారు. ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారిణి అంబిక, సలహాదారు బండి సంధ్యారాణి, జె.ప్రకాష్ రైతులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రభాకర్‌ను అభినందిస్తున్న బడేటి చంటి, సొంగా రోషన్‌కుమార్, తదితరులు

ఘనంగా చింతమనేని ప్రభాకర్ జన్మదిన వేడుకలు

పెదవేగి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం దుగ్గిరాల గ్రామంలో జనసంద్రంగా మారింది. గురువారం రాత్రినుంచి అభిమానులు, పార్టీ నాయకులు ఎమ్మెల్యే నివాసానికి క్యూ కట్టారు. దెందులూరు, ఏలూరు నియోజకవర్గాలోపాటు ఇతర ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు భారీఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు, చింతలపూడి ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య, సొంగా రోషన్‌కుమార్, విజయవాడ జోన్ ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నూజివీడు, ఏలూరు డీఎస్పీలు ప్రసాద్, శ్రావణ్‌కుమార్ గజమాలతో సత్కరించారు. భారీ గజమాలలు వేసి కార్యకర్తలు అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ప్రజలు చూపిస్తున్న ప్రేమాభిమానాలు ఎనలేనివన్నారు. ఎప్పటికీ మీ సేవకుడిగా, కష్టం వస్తే ఇంటి పెద్దకొడుకుగా అండగా ఉంటానన్నారు. ఏలూరు ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుతోపాటు ఎన్టీఆర్ ట్రస్ట్, గుడ్ సమరిటన్ సంస్థల ఆధ్వర్యంలో 200 మంది రక్తదానం చేశారు.

- దెందులూరు : దెందులూరులో పారిశుధ్య కార్మికులకు ఏపీ యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్‌యాదవ్, సర్పంచ్ తోట యేసమ్మ, ఎంపీటీసీ శేషారత్నం, టీడీపీ గ్రామ అధ్యక్షుడు యిప్పిలి వెంకటేశ్వరావు, వీరమచనేని ప్రభాకర్ తదితరులు దుస్తులు, కోడిగుడ్లను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు సంపంగి వేణుగోపాలతిలక్, పార్టీ నాయకులు ఉన్నారు

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


విద్యార్థులకు పుస్తకాలు అందచేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుంచే పాఠ్యాంశాలను ఇష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు అన్నారు. శనివారపుపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు ముద్రించిన విజయకేతనం స్టడీ మెటీరియల్‌ను ఆమె చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల హెచ్ఎం ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే కష్టపడి లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలన్నారు. ఇన్‌చార్జి ఎంఈవో డీవీ రమణ, కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, మాజీ ఎంపీపీ లంకపల్లి మాణిక్యాలరావు, పాఠశాల ఉపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై రెవెన్యూ సదస్సులో ఫిర్యాదుల వెల్లువ

ఏలూరు రూరల్/లింగపాలెం /బుట్టాయగూడెం/ కామవరపుకోట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఆక్రమణలు తొలగించి న్యాయం చేయాలంటూ పలువురు బాధితులు వినతిపత్రాలు అందజేశారు. శుక్రవారం ఏలూ రు రూరల్ మండలం కొక్కిరాయలంక గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో చేపల చెరువులు, భూఆక్రమణలపై ఫిర్యాదులు అందాయి. అదే గ్రామానికి చెందిన గొట్టుముక్కల నందకిషోర్ తనకు 29.7 సెంట్ల భూమి సర్వే చేయాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ కి చెందిన ఓ వ్యక్తి తన చేపల చెరువుగట్టు 15 అడుగులు దారి ఆక్రమించాడని, తన భూమి ఇప్పించవలసిందిగా కోరారు. గొట్టుముక్కల పద్మావతి గ్రామంలో 0.77 సెంట్ల భూమి ఉందని, ఆ భూమి మరొకరికి లీజుకు ఇచ్చామన్నారు. ప్రస్తుతం అదే ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడు ఆక్రమించి చెరువు ఖాళీ చేయడం లేదని ఫిర్యాదు చేశారు. దంతులూరి ఆనందరాజు సర్వే నంబర్ 131, 139లో పొలానికి దారి ఇప్పించాలని ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దరఖాస్తు చేసిన 45 రోజుల్లో సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. లింగపాలెం మండలం కొత్తపల్లిలో తహసీల్దార్ నజీముల్లాషా ఆధ్వర్యంలో భూ సమస్యలపై ఇప్పటివరకు భూసమస్యలపై 225 అర్జీలు వచ్చాయని వాటిలో 125 సమస్యలను పరిష్కరించామన్నారు. బుట్టాయగూడెం మండలంలోని ముప్పినవారిగూడెం, దొరమామిడి గ్రామాల్లో తహసీల్దార్ పీవీ చలపతిరావు ఆధ్వర్యంలో వినతులు స్వీకరించారు. కామవరపుకోట మండలం ఆడమిల్లి సర్పంచ్ గూడపాటి కేశవరావు అధ్యక్షతన తహసీల్దార్ గెడ్డం ఎలీషా ఆధ్వర్యంలో ప్రజలు, రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

'రైతాంగ సమస్యలపై దశల వారీగా ఉద్యమం'

ఏలూరు కార్పొరేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రైతాంగ సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా ఉద్యమం చేపట్టాలని నిర్ణయించినట్టు ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం పవరుపేటలోని అన్నే భవనంలో జరిగిన రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ ఆత్మహత్యలకు ప్రభుత్వాల విధానమే కారణమన్నారు. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనమే తప్ప రైతుల ప్రయోజనాలు ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబానికి 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. పెదవేగి ఆయిల్‌ఫెడ్ కర్మాగారాన్ని ప్రైవేటీకరించాలనే ప్రయత్నాలు ఆపాలన్నారు. రైతు సంఘ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, సిరిబత్తుల సీతారామయ్య, ఘంటా పాపారావు, గుర్రం రాంబాబు, బోయపాటి గోవర్ధనరావు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

రమణీయం.. ధనుర్మాస ఉత్సవం


నీరాజనాలు అందుకుంటున్న శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

ద్వారకాతిరుమల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి, భూదేవి సమేత గోదాదేవితో కలిసి చినవెంకన్న ధనుర్మాస మండపంలో కొలువు దీరి భక్తులను అనుగ్రహించారు. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని తొలుత ఆలయ ఆవరణలో తొళక్క వాహనంపై శ్రీవారు, అమ్మవార్లతో పాటు గోదాదేవి ఉత్సవమూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం పురవీధుల్లో ఊరేగించారు. ఆతరువాత మండపంలో ఉంచి పూజలు చేసి హారతులిచ్చారు.

కోదండ రామాలయంలో లక్ష తులసి పూజ

చింతలపూడి : స్థానిక కోదండ రామాలయంలో ధనుర్మాసం సందర్భంగా గోదా రంగనాథ స్వాములకు మహిళా భక్తులు లక్షల తులసి పూజా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పూజ అనంతరం పలు రకాల పుష్పాలతో గోదాదేవి, రంగనాధ స్వాములకు అలంకరణ జరిపారు.


సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ కిశోర్

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్పీ

ఏలూరు క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బంది సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. ప్రతి శుక్రవారం సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం సంక్షేమ దివస్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పలువురు పోలీస్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, హోంగార్డు నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

పిలకలు తొడిగే దశకు వరి నాట్లు

ఉంగుటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : దాళ్వా వరి రైతులు ప్రస్తుతం నాట్లు వేసే దశ నుంచి పిలకలు తొడిగే దశకు చేరుకున్నాయని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ అన్నారు. శుక్రవారం అక్కుపల్లిగోకవరంలో నాట్లు వేసిన పిలక దశకు చేరుకున్న దాళ్వా వరి పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఖరీఫ్‌లో వేసిన వరి అవశేషాలు సరిగా కుళ్లక పోవడం వెంటనే దాళ్వా నాట్లు వేయడం వల్ల నాట్లు వేసిన 15-20 రోజులలో చినిపోవడం జరిగిన విషయాన్ని గమనించానని రైతులకు సూచనలు చేశారు. ఏవో ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల ధర్నా

చింతలపూడి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్యాలయం వద్ద మునిసిపల్ ఇంజనీర్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా జరిపారు. ధర్నాలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.వి.సత్యనారాయణ మాట్లాడుతూ 2023 డిసెంబరులోని సమ్మె సందర్భంగా ప్రభుత్వం మునిసిపల్ కార్మికులకు ఇచ్చిన హామీపై జీవో విడుదల చేయక పోవడం శోచనీయమన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ బి.పావనికి వినతి పత్రం అందించారు. ధర్నాలో నాయకులు సూర్యకుమార్, విజయరాజు, సలీం, నాగరాజు, మనోహర్ పాల్గొన్నారు.

13 మంది జూదరుల అరెస్ట్

ఏలూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం పట్టణ శివారులోని తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద వున్న రూ.లక్షా ఇరవై రెండు వేలు నగదు, 12 సెల్ ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్‌కె.జబీర్ తెలిపారు.

గిరిజన విద్యార్థులకు స్వీట్ల పంపిణీ

చింతలపూడి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శెట్టివారిగూడెం రోడ్డులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ హాస్టల్‌లోని విద్యార్థులకు నూతన సంవత్సరం పురస్కరించుకుని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సతీమణి విజయ విద్యార్థులకు పండ్లు, స్వీట్లు అందజేశారు. డీటీ సంధ్య, మిషన్ హోప్ సభ్యులు పాల్గొన్నారు.



హైందవ శంఖారావానికి తరలిరావాలని ఏలూరు నగరంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు

రేపు హైందవ శంఖారావం



- భారీగా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లాలో విస్తృత ప్రచారం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కలిగించాలని, ఆలయాల నిర్వహణలో సంస్కరణలు కోరుతూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఈ నెల 5న గన్నవరం సమీపాన కేసరపల్లి హైందవ శంఖారావం నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి భారీగా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లో ప్రజలను చైతన్య పరిచేలా ప్రచారం నిర్వహించారు. దేవాలయాల్లో, దేవదాయ ధర్మదాయ శాఖలో అన్యమత ఉద్యోగులను తొలగించాలని, పూజ, ప్రసాద కైంకర్య సేవలన్నీ అత్యంత భక్తిశ్రద్ధలతో నాణ్యతతో నిర్వహించాలని, దీనిని ఉల్లంఘించే వారిని కఠినంగా శిక్షించాలని, మరో 8 డిమాండ్లతో శంఖారావానికి నాంది పలికారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న ఏకైక నినాదంతో ఇంతకు ముందే వివిధ రాష్ట్రాల గవర్నర్లకు మెమోరాండం సమర్పించారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జరుగుతున్న హైందవ శంఖారావానికి పెద్ద ఎత్తున ప్రచారం కల్పించారు. పార్టీలకు అతీతంగా ముఖ్యులను కలిసి శంఖారావానికి హాజరుకావాల్సిందిగా ఆహ్వాన పత్రికలను అందించారు. మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ప్రదర్శనలతో విస్తృత ప్రచారం చేపట్టారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో హిందువులు మాత్రమే ఉండాలని, దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లో రాజకీయ పార్టీలతో ప్రమేయంలేని హిందూ దైవ భక్తులను మాత్రమే ఉండాలని, దేవాలయాల నిర్వహణపై ధర్మాచార్యుల నమూనా విధి విధానాలను అమలు చేయాలని, దేవాలయాల పరిసరాల్లో దుకాణాలన్నీ హిందువులకే కేటాయించాలని, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని, కబ్జాకు గురైన ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. హైందవ శంఖారావానికి తరలివెళ్ళేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. బీజేపీ శ్రేణులు, అనుబంధ సంఘాల వారు వీటిలో నిమగ్నమయ్యాయి. బీజేపీ నేత తపన చౌదరి తన వంతు బాధ్యతను నిర్వహిస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నారు. దేవాలయాల పరిరక్షణకు జాతీయ స్థాయి ఉద్యమంలో తాను భాగస్వామి అన్నట్టుగా తపన చౌదరి జిల్లాలో అన్ని సమావేశాలకు హాజరయ్యారు.

హైందవ శంఖారావానికి ఏలూరు జిల్లా నుంచి 500 బస్సులు, కార్లు, బైక్‌లతో ప్రజలు తరలి వెళ్లనున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు. వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు హైందవ శంఖారావం బహిరంగ సభకు అధ్యక్షత వహించనున్నారు. జాతీయ రహదారి పొడవునా పెద్ద ఎత్తున వెలిసిన హైందవ శంఖారావం హోర్డింగ్‌లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

డ్రెయినేజీల సమస్యలు పరిష్కరించాలి

కలిదిండి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కలిదిండి మండలంలో ఇరిగేషన్, డ్రెయినేజీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కలిదిండి, కోరుకొల్లు డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ కోరారు. శుక్రవారం విజయవాడలో ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి విన్నవించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారని తెలిపారు.



మంత్రి నిమ్మలను కలిసిన డీసీ చైర్మన్లు

స్వచ్ఛందంగా పోతుమర్రు కాల్వ పూడికతీత పనులు

కలిదిండి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛందంగా పోతుమర్రు కాల్వ పూడికతీత పనులను వెంకటాపురం సర్పంచ్ గూడవల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు చేపట్టారు. వెంకటాపురంలో తాగునీటి చెరువును నింపేందుకు కోరుకొల్లు నుంచి వెంకటాపురం వరకు కాల్వ పూడిక తీస్తున్నారు. తాగునీటి వంతు ఇవ్వగానే చెరువును పూర్తిగా నింపుతామని తెలిపారు.



కాలువ పూడిక తీస్తున్న రైతులు

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

కైకలూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కె.పంకజ్‌కుమార్, ఏఎంవో రెడ్డి రామారావు అన్నారు. శుక్రవారం కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనాన్ని రుచి చూసి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారమే ప్రతీరోజూ భోజనాన్ని అందించాలన్నారు. ప్రతీ రోజూ భోజనం వసతి ఎలా ఉంటుందని విద్యార్థులను ఆరా తీశారు. స్కూల్ హెచ్ఎం పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న పంకజ్‌కుమార్

గాయకుడు జమీల్ అహ్మద్‌కు సత్కారం

కైకలూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కైకలూరు మానవతా సేవా స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థపై పాట రచించిన గాయకుడుని శుక్రవారం ఘనంగా సన్మానించారు. మానవతా సేవా స్వచ్ఛంద సంస్థ పేరుతో కైకలూరు విద్యాంజలి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఎస్.జమీల్ అహ్మద్ పాటను రచించి, గానం చేయడం అభినందనీయమని సంస్థ గౌరవ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారా యణ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 125 ప్రదేశా ల్లో స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఈ సంస్థ ద్వారా నిర్వహించే ప్రతీ కార్యక్రమానికి ఇకపై ముందుగా ఈ పాటను వినిపించిన తరువాతే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా జమీల్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గుర్రం శ్యాంకుమార్, తలారి గోపాలకృష్ణ, క్షత్రి య సంఘం అధ్యక్షుడు రామరాజు, జనసేన నేతలు తోట లక్ష్మి, శొంఠి రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



గాయకుడు జమీల్ అహ్మద్‌ను సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

తల్లిదండ్రులు మందలించారని విద్యార్థిని ఆత్మహత్య

ఏలూరు క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సరిగా చదవకపోవడంతో మార్కులు రావడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఒక విద్యార్థిని శుక్రవారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్పడింది. ఏలూరులోని బావి శెట్టి వారిపేటకు చెందిన సింహాద్రి షణ్ముకాచారి కార్పెంటర్. అతనికి భార్య శ్రీదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె ధరణి(14) పవర్‌పేటలోని దీప్తి స్కూలులో చదువుతుంది. చిన్న కుమార్తె హిమశ్రీ కూడా స్కూలుకు వెళ్తుంది. శ్రీదేవి కూడా దీప్తి స్కూల్‌లోనే టీచర్‌గా పనిచేస్తున్నారు. ధరణి ఇటీవల ప్రో గ్రెస్ కార్డులో మార్కులు తక్కువగా రావడంతో తల్లిదండ్రులు బాగా చదవాలని మందలించారు. దీంతో ఆమె మనస్తాపానికి గురైంది. శుక్రవారం ఉదయం షణ్ముకాచారి తన చిన్న కుమార్తెను, భార్యను స్కూలులో దించి రావడానికి వెళ్ళారు. ధరణి స్కూల్ యూనిఫామ్ ధరించి సిద్ధంగా ఉంది. అయితే తండ్రి తిరిగి వచ్చేటప్పటికి ధరణి ఉరివేసుకుని వేలాడుతూ కనిపిం చింది. వెంటనే ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా మృతి చెందిందని నిర్ధారించారు. అనుమానాస్పద మృ తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ధరణి మృతదేహం

పురోహితుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం: కుటుంబ కలహాల కారణంగా శుక్రవారం రాత్రి ఒక పురోహితుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు సమీపంలోని వట్లూరులో ఉన్న ఇంద్రప్రస్థలో గంటసాల విశ్వనాథ వెంకట సత్యనారాయణ (40) పౌరోహిత్యం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్ర వారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



కైకలూరులో టీచర్లను సత్కరిస్తున్న టీడీపీ నాయకుడు తేరా రమేష్‌బాబు



మట్టగుంటలో పూలే చిత్రపటం వద్ద బీసీ నాయకుల నివాళులు



వడాలిలో సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మహనీయురాలు సావిత్రీబాయి పూలే

- వాడవాడలా జయంతి వేడుకలు
- చిత్రపటాలు, విగ్రహాల వద్ద ప్రముఖుల నివాళులు

కైకలూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మహిళల సమస్యలకు పరిష్కారమార్గం చూపిన మహనీ యురాలు సావిత్రిబాయి పూలే అని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం కైకలూరు మండలం వేమవరప్పాడు ఎంపీయూపీ స్కూల్లో టీడీపీ కో-కన్వీనర్ తేరా రమేష్‌బాబు ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యా యులను ఘనంగా సత్కరించారు. రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి అడవి ప్రసాద్ మహిళా ఉపాధ్యాయులకు బహుమతులు అందించారు. హెచ్ఎం చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

- కలిదిండి : మట్టగుంటలో బీసీ నాయకులు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చక్రవర్తి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బళ్ల రాజు, నాయకులు కె.వెంకటేశ్వరరావు, టి.పరశురాముడు, వి.గణపతి, కె.సత్యనారాయణ, నాగరాజు, వడ్డి కాసులు తదితరులు పాల్గొన్నారు.
- ముదినేపల్లి : వడాలి జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం ప్రభుదాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్రప్రసాద్, మండల ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృపాకర్, వెంకటరత్నం, సీహెచ్.నాగమల్లేశ్వరరావు తదితరులు సావిత్రిబాయిపూలే చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. వాడవల్లి యూపీ పాఠశాలలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షురాలు ఎం.సాయిలక్ష్మి ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు.
- మండవల్లి : చింతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కేఎస్ఆర్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, శారదారాణి, రోజారాణి, స్వప్న, మధుమతి, రవి, నగేష్, శంకర్, సుబ్బారావు, నోబుల్, రామాంజనేయులు పాల్గొన్నారు.

తొలి ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయి పూలే



మర్లపాలెం హైస్కూల్‌లో ఉపాధ్యాయినులకు సన్మానం

చాట్రాయి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మర్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం దేశంలో తొలి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి శుక్రవారం నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు అనసూయ, శివరూప, రాధికను ఘనంగా సన్మానించారు. శుభదిన్ కార్యక్రమంలో భాగంగా గణిత ఉపాధ్యాయుడు పి రాఘవరావు విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మచారి, హెచ్ఎం బక్కయ్య, స్టాఫ్ సెక్రటరీ రఘు, పీడీ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

- ముసునూరు: పాఠశాలల్లో సంఘ సంస్కర్త, విద్యావేత్త సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. స్త్రీ విద్య అభివృద్ధికి కృషిచేసిన తొలి తరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని హెచ్ఎం వీవీఎస్.రామకృష్ణారావు అన్నారు. చెక్కపల్లి పాఠశాల హెచ్ఎం కపిలవాయి ధన నాగలక్ష్మిని ఎస్ఎంసీ చైర్మన్ చంద్రు శేఖర్, వైస్ చైర్మన్ గంగుల తిరుమల, అంగన్‌వాడీ కార్యకర్త కనకదుర్గ, కమిటీ సభ్యులు సన్మానించారు.

మహిళా అభ్యర్థులకు స్పోర్ట్స్ ఈవెంట్స్

- 102 మంది అర్హత

ఏలూరు క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి):పోలీసు కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్‌లో భాగంగా మహిళా అభ్యర్థినులకు శుక్రవారం ప్రత్యేకంగా స్పోర్ట్స్ ఈవెంట్స్ నిర్వహించారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో తెల్లవారుజాము నుంచే ఈ పరీక్షలను చేపట్టారు. శుక్రవారం 490 మంది మహిళా అభ్యర్థినులు హాజరు అవ్వాలని హాల్‌టిక్కెట్లు జారీ చేయగా 242 మంది మాత్రమే హాజరయ్యారు. వారిలో 102 మంది స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో అర్హత సాధించారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ అభ్యర్థినులకు పలు సూచనలు ఇచ్చారు. దేహదారుఢ్య పరీక్షల నిర్వహణకు సాంతికేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్ కెమెరాల ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. శనివారం కూడా మహిళా అభ్యర్థినులకు స్పోర్ట్స్ ఈవెంట్స్ నిర్వహిస్తారు.



అభ్యర్థి ఎత్తును పరిశీలిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్



టీమ్‌ల నమోదు పరిశీలన

ట్రిపుల్‌ఐటీలో టెక్ హాకథాన్

నూజివీడు టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో యూనివర్సిటీ స్థాయి టెక్ హ్యాకథాన్ ఫేజ్-2 శుక్రవారం ప్రారంభించారు. రెండు రోజులు నిర్వహించే ఈవెంట్‌లో లైంగిక వేధింపుల నివారణపై వినూత్న మొబైల్ అప్లికేషన్‌ల అభివృద్ధి అంశాన్ని తీసుకున్నట్లు ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. ఇన్‌వెన్‌టిజ్ సాఫ్ట్‌వేర్ వ్యవస్థాపకులు ఇంద్రజిత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దాదాపు 43 టీమ్‌లు రిజిస్టర్ కాగా షార్ట్‌లిస్ట్ చేసిన 13టీమ్‌లు ఈవెంట్‌లో పాల్గొంటున్నారు. ఆర్జీయూకేటీ రిజిస్టర్ ఎస్.అమరేంద్రకుమార్, ఏవో బి.లక్ష్మణరావు, సిఏవో బండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు క్రీడాకారుల ఎంపిక

నూజివీడు టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా టెన్నికాయిట్ జూనియర్ జట్ల ఎంపిక ప్రక్రియను ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 5న నిర్వహిస్తున్నట్లు జిల్లా సెక్రటరి డి.సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 11, 12 తేదీల్లో పలాసలో నిర్వహించే రాష్ట్ర జూనియర్ టెన్నికాయిట్ టోర్నమెంట్ పోటీలకు ఉమ్మడి కృష్ణాజిల్లా జట్ల ఎంపికను నిర్వహిస్తున్నామన్నారు. 1-4-2006 తరువాత జన్మించిన బాలబాలికలు ఈ క్రీడాకారుల ఎంపికలో పాల్గొనవచ్చని ఇతర వివరాలకు 9440696797 నంబర్‌కు సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

ఎరువుల వాడకం తగ్గించాలి

చాట్రాయి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పంటలకు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ఏవో శివశంకర్ కోరారు. చాట్రాయిలో మొక్కజొన్న తోటలను శుక్రవారం ఆయన పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో మొక్కజొన్న పంట హెక్టారుకు 200కేజీల నుంచి 240 కేజీల వరకు నత్రజని, భాస్వ రం 80 కిలోలు, పొటాష్ 80 కిలోలు ఎరువులను వాడుకోవాలన్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

ముసునూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లిలో సారా విక్రయి స్తున్న చిట్టిబొమ్మ లక్ష్మిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎమస్తానయ్య తెలిపారు. 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.

ప్రధాన కాల్వల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి

ముదినేపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాన పంటకాల్వల పరిధిలోని శివారు ప్రాంతాలకు సాగు, తాగునీటి అవసరాలకు నీటిని సరఫరా చేసేందుకు కాల్వల అభివృద్ధి పనులు చేపట్టాలని కృష్ణా, తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్ఈ మోహనరావును ముదినేపల్లి ప్రాంత డీసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు కోరారు. శుక్రవారం విజయవాడలో కమిటీ చైర్మన్, ఎస్ఈని ముదినేపల్లి డీసీ చైర్మన్ నారగాని నాగేశ్వరరావు, వైస్ చైర్మన్ హనుమార పెదబాబు, పెదగొన్నూరు డీసీ చైర్మన్ గుడిసేవ సురేష్‌బాబు, వైస్ చైర్మన్ పోతుమూడి సోమేశ్వరరావు కలసి ఇరిగేషన్, డ్రెయినేజీ సమస్యలను వివరించారు. పంట కాల్వలపై లస్కర్లు లేక నీటి పంపిణీలో పలు సమస్యలు తలెత్తుతున్నాయని, రోజు వారీ వేతనంపై లస్కర్లను నియమించేందుకు డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అవకాశం కల్పించాలని కోరారు. కాల్వల్లో డెక్క, తూడు నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.



కృష్ణా, తూర్పు డెల్టా పీసీ చైర్మన్‌ను కలసిన ముదినేపల్లి, పెదగొన్నూరు డీసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు

పేదలకు ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నూజివీడు టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదలకు ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. మండల పరిషత్ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎంపీడీవో రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు మంజూరులో అవకతవకలు గుర్తించామన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించడం జరిగిందని, త్వరలో జాబ్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఎవరు డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేద న్నారు. దివ్యాంగుల పింఛన్‌లలో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో పింఛ న్లకు సంబంధించి డాక్టర్ల బృందం సర్వే నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు. ఏవో ఆలూరి చాముండేశ్వరి మాట్లాడుతూ పంటల బీమా పథకాన్ని రైతులు వినియో గించుకోవాలన్నారు. పీఎం కిసాన్ పథకంలో లబ్ధి చేకూరాలంటే ఈకేవైసీ చేసుకుని ఉండాలని సూచించారు. ఉద్యాన శాఖ అధికారిణి ఆర్.హేమ మాట్లా డుతూ మామిడి రైతులకు ఫ్రూట్ కవర్లను 50శాతం సబ్సిడీపై అందిస్తున్నామని, ఎకరాకు 10వేల కవర్లు అందిస్తామన్నారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ కృష్ణంరాజు, వైస్ ఎంపీపీలు అక్కినేని శ్రీవాణి చౌదరి, స్వర్ణలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ముసునూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ముసునూరు ఎస్సీ కాలనీలో బాధిత కుటుంబానికి టీడీపీ నాయకుడు ఆర్థికసాయం చేశారు. తాణంకి రంగరావు(35) గురువారం మొక్కజొన్న పంటకు నీరుపెడుతుండగా గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను టీడీపీ నేత గార్లపాటి నరసింహారావు పరామర్శించి, రూ.10 వేలు నగదు అందజేశారు. టీడీపీ నాయకులు చీలి అర్లప్ప, యంద్రపాటి రాంబాబు, దుక్కిపాటి ఇస్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

పది స్టడీ మెటీరియల్ వితరణ

ముసునూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేట జడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయులు అమ్ముల సుధాకర్ శుక్రవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను 60 మంది పదవ తరగతి విద్యార్థులకు సుధాకర్ సతీమణి అమ్ముల రాజేశ్వరి జ్ఞాపకార్థం అందజేశారు. విద్యార్థులు పట్టుదలతో కష్టపడి చదువుకుని మంచి గ్రేడ్ మార్కులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

ఇంటర్వ్యూ..

కోడి పందేలు, జూదం నిర్వహిస్తే చర్యలు తప్పవు

వి. రవికుమార్
సీఐ, కైకలూరు రూరల్



- **సంక్రాంతి సందర్భంగా జూదం నియంత్రణకు చర్యలు చేపట్టారా ?**

జవాబు : ఇప్పటి నుంచే గ్రామాల్లో పోలీస్‌పికెట్ ఏర్పాటు చేస్తున్నాం. కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం.

- **గతంలో కేసులున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారా ?**

జవాబు : గతంలో జూదం నిర్వహించి కేసులు నమోదైన ప్రతీ ఒక్కరిపై ముందస్తుగా బైండోవర్ చేస్తున్నాం.

- **ఇప్పటివరకు ఏవిధమైన చర్యలు తీసుకున్నారు ?**

జవాబు : గ్రామాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో యువత పెడదారి పట్టకుండా జూదం నియంత్రించేందుకు గ్రామపెద్దలు పోలీసులకు సమాచారం అందించాలి.

- **యువత ఆటల పట్ల మక్కువ చూపేలా అవగాహన కల్పించారా ?**

జవాబు : అన్ని గ్రామాల్లోనూ ఆయా గ్రామపెద్దల సమక్షంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

- **జూదాలు ప్రోత్సహించే వారిపై చర్యలు ఉంటాయా ?**

జవాబు : కోడి పందేలు, జూదం నిర్వహణకు స్థలాలు ఇచ్చేవారు శిక్షార్హులే చర్యలు తీసుకుంటాం.

(ఆంధ్రజ్యోతి-కైకలూరు)

శతాధిక వృద్ధురాలు తిరుమలమ్మ మృతి



తిరుమలమ్మ (ఫైల్)

ముదినేపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం దేవపూడి గ్రామంలో శతాధిక వృద్ధురాలు మృతి చెందింది. ఆ గ్రామానికి చెందిన తిరుక్కవఝ్ఝారి తిరుమల మ్మ(112) అనే వృద్ధురాలు శుక్రవారం ఉదయం ఆయాసానికి గురై శ్వాస అందక తుది శ్వాస విడిచింది. సుమారు 50 ఏళ్ల క్రితమే ఆమె భర్త మృతి చెందగా, సంతానం లేని ఆ వృద్ధురాలు ఓ యువతిని పెంచుకుంది. మరణించిన ఆ శతాధిక వృద్ధురాలు చనిపోయే వరకు తన పనులు తానే చేసుకునేది. గురువారం ఆమె గ్రామంలోని సొసైటీ వద్దకు స్వయంగా నడుచుకుంటూ వచ్చి వెళ్లిందని స్థానికులు చెబుతున్నారు. వృద్ధురాలి భౌతికకాయాన్ని సందర్శించి పలువురు గ్రామస్థులు నివాళులర్పించారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నూజివీడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. జి.రాజు మాట్లాడుతూ సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణం అమలు చేయాలన్నారు. మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జయలక్ష్మి, రజినీ, రాధ, భారతి, భవాని, గౌరీ, రంగమ్మ, గోవింద్, ఏడుకొండలు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

నూజివీడు టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): లాయర్లపై పోలీసులు దాడిని నిరసిస్తూ నూజివీడు కోర్టుహాలు ప్రాంగణం వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతపురంలో లాయర్‌పై పోలీసులు దాడికి దిగిన నేపథ్యంలో నూజివీడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు న్యాయవాదులపైనే దాడులకు దిగడంపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్రైవర్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

నూజివీడు టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్ అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నూజివీడు ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ బెంగళూరు బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు దిగుతూ పడి మృతిచెందిన నేపథ్యంలో అందుకు డ్రైవర్‌ను బాధ్యులను చేయడం తగదని, డ్రైవర్ దాసుపై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను తక్షణం ఉపసంహరించాలని ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.